విశాఖపట్టణం
ఆదివారం 14 జూన్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:141 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## ఎన్నికల్లో రజనీకాంత్... అధికారంలోకి వచ్చాక గజనీ...!



ఆయనే బోగస్ నాయుడు అంటూ నిప్పులు చెరిగిన ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

2

# బెంగాల్ రాజకీయాల్లో సీఎం రమేశ్ చిచ్చు

### తృణమూల్ కాంగ్రెస్ సంక్షోభంలో కీలక పాత్ర

### బీజేపీలో ఎంపీలు చేరేలా బ్యాక్ డోర్ లాబీయింగ్

### రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం




**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ప్రస్తుతం నడుస్తున్న తృణమూల్ కాంగ్రెస్ సంక్షోభంలో ఒక అనూహ్యమైన పేరు తెరపైకి వచ్చింది. ఆ పేరే.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీఎం రమేష్. తెలుగు మాట్లాడే, ఒకప్పుడు టీడీపీలో ఉండి ఇప్పుడు బీజేపీలో కొనసాగుతున్న ఈ ఎంపీకి, బెంగాల్ టీఎంసీ ఎంపీలను కాషాయ గూటికి చేర్చడంలో ఏం సంబంధం? అనే ప్రశ్న ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఆపరేషన్ మొత్తానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి, కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌లు అధికారికంగా ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరిస్తున్నప్పటికీ.. తెరవెనుక ఉండి ఎక్కువ మంది టీఎంసీ నేతలకు ఫోన్లు చేసి సంప్రదింపులు జరిపింది మాత్రం వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడైన సీఎం రమేషే కావడం గమనార్హం. ఈ పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో తన పాత్రను అంగీకరిస్తూ సీఎం రమేష్ ఒక ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ప్రజలను ఒప్పించడమే నా నైపుణ్యం. నాకు కేవలం ఒక రెండు గంటల సమయం ఇస్తే చాలు, ఎవరినైనా సరే బీజేపీలో చేరేలా నేను ఒప్పించగలను.' అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలలో చాలామంది తనకు చాలా కాలంగా తెలుసని, పార్లమెంట్ కాంప్లెక్స్ లోని క్యాంటీన్‌లో తరచూ కలవడం వల్ల గత కొన్నేళ్లుగా వారితో మంచి స్నేహ బంధం ఏర్పడిందని రమేష్ చెప్పుకొచ్చారు. ఆయన చెప్పిన మాటల్లో నిజం లేకపోలేదు. 2020లో దుబాయ్, హైదరాబాద్‌లలో జరిగిన ఆయన కుమారుడి వివాహ వేడుకలకు పార్టీలతీతంగా రాజకీయ నాయకులు హాజరయ్యారు. అప్పట్లో మమతా బెనర్జీకి అత్యంత నమ్మకస్థురాలిగా ఉండి, ఇప్పుడు తిరుగుబాటు చేసిన శతాబ్ది రాయ్ కూడా ఆ పెళ్లి వేడుకలకు హాజరవడం విశేషం.

**ఎంపీలకు లభించిన హామీలు ఏంటి?**

మమతా బెనర్జీ మద్దతుదారులు, ఈ తిరుగుబాటును విమర్శిస్తున్న వారు చెబుతున్న దాని ప్రకారం.. ఈ 22 మంది ఎంపీలను (లోక్‌సభలో ..మిగతా 2లో



## రాహుల్ సమరం

### నీట్ వైఫల్యంపై ఆందోళనలు

### జూన్ 17 న కోటా వేదికగా ఉద్యమం

### దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపు

### ఉధృతంగా డిజిటల్, క్యాంపస్ ప్రచారాలు

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

దేశంలోని నిరుద్యోగ యువత, విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమయ్యారు. ఇటీవల కాలంలో దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన పరీక్షల కుంభకోణాలు, పేపర్ లీకేజీల అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఆయన దేశవ్యాప్త విద్యార్థి సదస్సులకు శ్రీకారం చుడుతున్నారు. రాజస్థాన్‌లోని ప్రసిద్ధ కోచింగ్ హబ్ 'కోటా' వేదికగా జూన్ 17న ఈ ఉద్యమం ప్రారంభం కానుంది. ఈ దేశవ్యాప్త ఉద్యమానికి సంబంధించిన కార్యాచరణను కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది. "పరీక్షల కుంభకోణాల వల్ల ప్రత్యక్షంగా నష్టపోయిన విద్యార్థులు, ఉద్యోగార్థులు, విద్యావేత్తలు, యువజన సంఘాలను ఒకే తాటిపైకి తెచ్చేందుకు రాహుల్ గాంధీ ఈ భారీ సదస్సులు నిర్వహిస్తున్నారు. జూన్ 17న కోటాలో ప్రారంభమయ్యే ..మిగతా 2లో

# హైవేల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్లు

### 74 కారిడార్లలో నిర్వహణకు నిర్ణయం

### అంతరరాష్ట్ర రహదారులకు ప్రాధాన్యత

### పీఎం ఈ - డ్రైవ్ స్కీమ్ లో నిర్వహణ

### ప్రైవేటు రంగంలో 50వేల ఈ బస్సులకు ఓకే

### కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మక ప్రణాళిక

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత ప్రోత్సహించడానికి మరియు ముఖ్యంగా ఎలక్ట్రిక్ బస్సులు, ఇ-ట్రక్కుల మౌలిక సదుపాయాల కొరతను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం ఒక పెద్ద వ్యూహాత్మక ప్రణాళికను సిద్ధం చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న 74 ప్రాధాన్యత కలిగిన హైవే కారిడార్లలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలు, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియాలను కేంద్రం కోరింది. జూన్ 4న రాష్ట్రాలు, ఎన్‌హెచ్‌ఏఐకి పంపిన అధికారిక లేఖలో కేంద్ర ప్రభుత్వం 74 ప్రాధాన్యత కలిగిన రూట్లను గుర్తించింది. ఇందులో ఎలక్ట్రిక్ కార్లు, బస్సుల కోసం 50 రూట్లు ఉన్నాయి. ఇ-ట్రక్కుల రవాణా కోసం 24 ఫ్రైట్ కారిడార్లను కేటాయించారు. ఈ ..మిగతా 2లో





# నైరుతి జోరు..!

### రాష్ట్రమంతటా రుతుపవనాల విస్తరణ

### ఈదురు గాలులతో మోస్తారు వర్షాలు

**(అమరావతి - జయజయహే)**


వాతావరణశాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. ఆదివారం రాష్ట్రానికి భారీ వర్షసూచన జారీ చేసింది. నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకగా.. అన్ని ప్రాంతాలకు క్రమక్రమంగా విస్తరిస్తున్నాయి. దీని ప్రభావంతో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా మేఘవృతమైన వాతావరణంతో పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ..మిగతా 2లో

## ఉక్కు ఘటనలో మరొకరు మృతి

### సెవన్ హిల్స్‌లో చికిత్స పొందుతూ కన్నుమూత

### ప్రమాదంలో 10కి చేరిన మృతుల సంఖ్య

**(విశాఖపట్నం - జయజయహే)**



విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ లో చోటుచేసుకున్న పేలుడు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, గత కొన్ని రోజులుగా మృత్యువుతో పోరాడుతున్న కాంట్రాక్ట్ కార్మికుడు సూరిబాబు శనివారం కన్నుమూశారు. నగరంలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. సూరిబాబు మరణంతో ఈ దారుణ ఉదంతంలో మృతి చెందిన వారి మొత్తం సంఖ్య పదికి చేరింది. మరణించిన సూరిబాబు కుటుంబం పెదగంట్యాడ మండలం సీతానగరం గ్రామంలో నివాసం ఉంటోంది. ఆయనకు భార్య వరలక్ష్మి, ఇద్దరు పిల్లలు లోకేష్, ప్రమీల ఉన్నారు. ఆప్యాయంగా చూసుకునే తండ్రి, ఇల్లాలికి కొండంత అండగా ఉండే భర్త.. కేవలం ప్లాంట్ యాజమాన్యం, అధికారుల నిర్లక్ష్యం వల్లే దూరమయ్యాడంటూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి వద్ద కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కష్టపడి పనిచేస్తూ కుటుంబాన్ని సాకుతున్న యజమానిని కోల్పోవడంతో ..మిగతా 2లో

## అప్పన్నా...నీ రక్షకుని నిజరూపం ఏందయ్యా!

### ఓ పక్క వెంటాడుతున్న ఏసీబీ కేసులు

### అవినీతి కంపు కొడుతున్న రెవెన్యూ విభాగం

### శ్రీకాకుళం మంత్రి అండదండలతో రెచ్చిపోతున్న వైనం

### అప్పన్న భూములను పప్పు బెల్లాల్లా పంచేస్తున్న అధికారగణం



## ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

### నియమించిన కేంద్ర ప్రభుత్వం



2

## చిన్నారి జ్ఞానేశ్వరి ఎక్కడ..?

### వారం రోజులుగా మిస్సింగ్

### పెంపుడు కుక్క అనారోగ్యంతో మృతి

### జీపీఎస్‌తో ఆచూకీ కోసం ప్రయత్నాలు

**(కాకినాడ - జయజయహే)**

కాకినాడ జిల్లా సీహెచ్ అగ్రహారంలో రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమై 8 రోజులు దాటింది. అయితే ఈ కేసు దర్యాప్తులో అత్యంత కీలకమైన ఆధారంగా భావించిన పెంపుడు కుక్క శనివారం నాడు హఠాత్తుగా మృతి చెందింది. ఈ ఘటనతో అటు పోలీసులు, ఇటు బాలిక తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. చిన్నారి ఆచూకీ చెబుతుందనుకున్న మూగజీవం అనారోగ్యంతో కన్నుమూయడంతో కేసు దర్యాప్తుపై సందిగ్ధత నెలకొంది. ఈనెల 6వ తేదీన చిన్నారి జ్ఞానేశ్వరి ఇల్లు దాటి బయటకు వెళ్లిన సమయంలో ఈ పెంపుడు కుక్క కూడా ..మిగతా 3లో



For a pure tomorrow.. జయహే

# హైవేల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్లు

**మొదటి పేజీ తరువాయి...**



కారిడార్లలో అహ్మదాబాద్-ముంబై, బెంగళూరు-ముంబై, చెన్నై-నాగర్‌కోయిల్, హైదరాబాద్-రాయ్‌పూర్, పానిపట్-గోరఖ్‌పూర్ వంటి దేశంలోని అత్యంత కీలకమైన అంతర్రాష్ట్ర రహదారులు ఉన్నాయి. ఆర్థిక సంవత్సరం 2028 ముగిసే వరకు అమలులో ఉండే 'పీఎం ఈ-డ్రైవ్' పథకం కింద ఈ కేంద్రాల ఏర్పాటుకు తక్షణమే ప్రతిపాదనలు పంపాలని కేంద్రం స్పష్టం చేసింది. భారీ పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న రూ. 10,900 కోట్ల 'పీఎం ఈ-డ్రైవ్' పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా ఛార్జింగ్ మౌలిక సదుపాయాల సబ్సిడీ కోసం రూ. 2,000 కోట్లు కేటాయించారు. ఇందులో భాగంగా, ఈ ఏడాది మే (2026) లోనే 4,874 పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్ల కోసం రూ. 504 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం ఆమోదించింది. ఇప్పటికే ఈ పథకం కింద వివిధ రాష్ట్రాల్లో 13,800 ప్రభుత్వ ఇ-బస్సులను మంజూరు చేయగా, రాబోయే దశాబ్దంలో ప్రైవేట్ రంగంలో మరో 50,000 ఇ-బస్సులను తీసుకురావడానికి ఆర్థిక సేవల విభాగం ప్రణాళికలు రచిస్తోంది.

**కమర్షియల్ వాహనాలకు హై-కెపాసిటీ ఛార్జర్లు**

ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్కుల కోసం 240 కిలోవాట్ కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న హై-కెపాసిటీ ఛార్జర్లు అవసరం. ప్రభుత్వ అంచనాల ప్రకారం ఒక్కో 240 కిలో వాట్ ఛార్జర్ ఏర్పాటుకు దాదాపు రూ. 8 లక్షల ఖర్చవుతుంది. "హైవేలపై మెరుగైన ఛార్జింగ్ సదుపాయాలు ఉంటే ఆపరేటర్లు మరింత నమ్మకంతో రూట్లను ప్లాన్ చేసుకోవచ్చు, ఛార్జింగ్ సమయాలను క్రమబద్ధీకరించవచ్చు. ప్రయాణ సమయాన్ని కచ్చితంగా అంచనా వేయవచ్చు" అని దక్షిణ భారతదేశంలో 86 ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతున్న 'ఫ్రెష్ బస్' వ్యవస్థాపకుడు, సీఈఓ సుధాకర్ చిర్రా పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ ప్రకారం భారతదేశంలో వాయు కాలుష్యానికి రోడ్డు రవాణా ఉద్గారాలు 20-30% కారణమవుతున్నాయి. ట్రక్కుల సంఖ్య మొత్తం వాహనాల్లో కేవలం 3.5% (2025 నాటికి) మాత్రమే ఉన్నప్పటికీ, రోడ్డు రవాణా రంగం విడుదల చేసే కాలుష్యంలో వాటి వాటా 33-35% వరకు ఉంటుంది. కాబట్టి డీజిల్ వాహనాల స్థానంలో జీరో-ఎమిషన్ వాహనాలను తీసుకురావడం ఎంతో అవసరమని నిపుణులు చెబుతున్నారు.

# ఎన్నికల్లో రజనీకాంత్... అధికారంలోకి వచ్చాక గజినీ...!

## ఆయనే బోగస్ నాయుడు అంటూ నిప్పులు చెరిగిన ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

**విశాఖపట్నం, జూన్ 13, జయ జయహే**

కూటమి రెండేళ్ల సభకు 'రెండేళ్ల నమ్మకం' కాదు.. 'రెండేళ్ల వెన్నుపోటు, సంక్షోభం' అని పేరు పెట్టాలని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. శనివారం విశాఖపట్నం వైయస్సార్సీపీ కార్యాలయంలో పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని బాండ్లు పంచి ఇప్పుడు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారన్నారు. రాష్ట్రంలో 'ఆడబిడ్డ నిధి' పథకానికి అర్హులైన 2 కోట్ల మంది మహిళలను కూటమి ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని, ఎన్నికల ప్రచారంలో ఎన్టీఆర్ విగ్రహానికి దండవేసి ప్రకటించిన 'ఆడబిడ్డ నిధి'ని చంద్రబాబు అటకెక్కించారని దుయ్యబట్టారు. జగన్ ప్రభుత్వంలో 'చేయూత' ద్వారా క్రమం తప్పకుండా మహిళల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని, 18 నుండి 60 ఏళ్ల లోపు మహిళలందరికీ నెలకు రూ.1500 ఇస్తామని నమ్మించి ఓట్లు వేయించుకున్న కూటమి నేతలు ఇప్పుడు జవాబివ్వడం లేదన్నారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా 'ఆడబిడ్డ నిధి' పథకాన్ని అమలు చేయకుండా తూట్లు పొడిచారని, ఎన్నికల సమయంలో 'ఆడబిడ్డ నిధి', 'పీ-4' వేర్వేరు అని చెప్పి.. ఇప్పుడు రెండూ ఒక్కటేనంటూ మాట మార్చారన్నారు. నాడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినట్లే.. నేడు 'ఆడబిడ్డ నిధి' అమలులో మహిళలందరికీ చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని, ఎన్నికల ప్రచారంలో రజనీకాంత్‌లా హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక గజనీలా చంద్రబాబు నాటకాలు ఆడుతున్నారని నిప్పులు చెరిగారు. నాడు 'స్వాతిముత్యం' కమల్ హాసన్‌లా నటించిన బాబు.. నేడు 'నాయకుడు' సినిమాలోని కన్నింగ్ పాత్రలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఇంట్లో ఎంతమంది మహిళలు ఉంటే అంతమందికీ డబ్బులిస్తామని బాండ్ పేపర్లపై సంతకాలు చేసి మరీ మోసం చేసిన ఘనుడని, 'తల్లికి వందనం' కింద ఇద్దరు పిల్లలు ఉంటే రూ.30 వేలు ఇస్తామన్న హామీ ఎటు పోయిందని నిలదీశారు. 'అన్నదాత సుఖీభవ' కింద కేంద్రంతో సంబంధం లేకుండా ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు అబద్ధాలు ఆడుతున్నారని నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి ఇస్తామని చెప్పి, గడిచిన రెండేళ్లలో రూపాయి కూడా కేటాయించలేదని, సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలతో మోసం చేసిన చంద్రబాబు నాయుడు కాదు.. 'చీటింగ్ బోగస్ నాయుడు'. గా అభివర్ణించారు.

# రాహుల్ సమరం

**మొదటి పేజీ తరువాయి...**



ఈ సదస్సులు, ఆ తర్వాత జూలై 10న అలహాబాద్, జూలై 11న పాట్నా, జూలై 14న ఢిల్లీలో జరగనున్నాయి" అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు.

**ఉధృతంగా డిజిటల్, క్యాంపస్ ప్రచారాలు**

యువత ఆకాంక్షలను అవినీతికి, ప్రభుత్వ అసమర్థతకు, రాజకీయ ఉదాసీనతకు బలికానివ్వకూడదనే బలమైన పట్టుదలతో రాహుల్ గాంధీ ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజకీయాలకు అతీతంగా విద్యార్థులందరినీ ఏకం చేయడమే ఈ ఉద్యమ లక్ష్యం. పరీక్షల నిర్వహణలో జరుగుతున్న వరుస వైఫల్యాలపై బాధ్యులను నిలదీసేందుకు, నష్టపోయిన యువత తమ అనుభవాలను పంచుకునేందుకు ఈ సదస్సులు ఒక వేదికగా నిలవనున్నాయి. ఈ ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అనుబంధ విభాగాలైన ఎన్ఎస్‌యూఐ , యూత్ కాంగ్రెస్‌తో పాటు పీసీసీ, డీసీసీలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించనున్నాయి. కోచింగ్ సెంటర్లు, యూనివర్సిటీలు, పాఠశాలలు, యూత్ హబ్‌లలో విద్యార్థులతో నేరుగా మాట్లాడటంతో పాటు డిజిటల్ ఆహ్వానాలు, సోషల్ మీడియా క్యాంపెయిన్లు, లైవ్ స్క్రీనింగ్‌ల ద్వారా ఈ ఉద్యమాన్ని భారీ ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు.

**కాంగ్రెస్ ప్రధాన డిమాండ్లు ఇవే**

రాహుల్ గాంధీ గతంలోనే లేవనెత్తిన డిమాండ్లను ఈ సదస్సుల ద్వారా వీధుల్లోకి తీసుకెళ్లి ప్రజల్లో పోరాట చైతన్యాన్ని పెంచాలని కాంగ్రెస్ నిర్ణయించింది. "నీట్ ) పరీక్షల వికేంద్రీకరణ జరగాలి, పరీక్షల ఫీజులను పూర్తిగా రద్దు చేయాలి. పేపర్ లీక్ ముఠాలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వంలో అత్యున్నత స్థాయిలో ఉన్నవారు ఈ వైఫల్యాలకు బాధ్యత వహించాలి. కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలి" అని కేసీ వేణుగోపాల్ డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రతిభకు రక్షణ కల్పించడం, అందరికీ సమాన అవకాశాలు అందించడం జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలని ఆయన పేర్కొన్నారు.

ఇటీవల జరిగిన నీట్-యూజీ పరీక్షల్లో పెద్ద ఎత్తున పేపర్ లీకేజీలు, పరిపాలనాపరమైన లోపాలు బయటపడటంతో కేంద్ర ప్రభుత్వం ఆ పరీక్షను రద్దు చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడటంతో ఈ అంశం తీవ్ర సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలోనే విద్యార్థుల్లో భరోసా నింపేందుకు, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ ఈ దేశవ్యాప్త పోరాటానికి సిద్ధమైంది.

# అప్పన్నా...నీ రక్షకుని నిజరూపం ఏందయ్యా!

## ఓ పక్క వెంటాడుతున్న ఏసీబీ కేసులు

## అవినీతి కంపు కొడుతున్న రెవెన్యూ విభాగం

## శ్రీకాకుళం మంత్రి అండదండలతో రెచ్చిపోతున్న వైనం

## అప్పన్న భూములను పప్పు బెల్లాల్లా పంచేస్తున్న అధికారగణం

**ఎంకే సునీల్ కుమార్ - జయ జయహే బ్యూరో**

సింహాచలం దేవస్థానంలో అలజడి మొదలైంది. అప్పన్న స్వామి సంగతి పక్కన పెడితే ఆయన సేవలో నిత్యం తరిస్తున్న ఓ ఉన్నతాధికారి నిజరూప దర్శన సంగతి తెలిసి అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. అవినీతిలో ఇంత పెద్ద ఘణాపాఠితోనా మనం నిత్యం సేవలందిస్తున్నది అంటూ చీదరించుకుంటున్నారు. లెక్కకు మించిన ఆస్తుల విషయంలో ఏసీబీ కేసు ఉంటుండగానే కూటమి పెద్దలను మేనేజ్ చేసుకుని అప్పన్న స్వామి సేవలో తరించాలని వచ్చి అది మానేసి చేస్తున్న అవినీతి దందా ఇప్పుడు కూటమి ఎమ్మెల్యేలకే షాక్ ఇచ్చేలా ఉంది. జిల్లాలోని కూటమి ఎమ్మెల్యేల మాట విన్నట్టు నటించడమే కానీ వారిని పూతిక పుల్లతో సమానంగా చూస్తాడని అక్కడి తోటి ఉద్యోగులే అంటున్నారు. అందుకు తాజాగా అనేక ఉదాహరణలు సైతం వెల్లడిస్తున్నారు. మరో పక్క అంతా కలెక్టర్ కనుసన్నల్లోనే జరుగుతున్నట్టు బిల్డప్ ఇవ్వడం మరో ఎత్తు...కానీ ఆయనకు తెలీకుండా....భూ కబ్జాదారులకు వంతపాడడం చూస్తుంటే...వామ్మో అనేట్టు ఆయన అవినీతి కార్యాలున్నాయి. నిఖార్సైన అధికారులను వెంటబడి మరీ వేధించడం...అప్పన్న భూములను పప్పు బెల్లాల్లా ఊరందరికీ అంటే డబ్బులిచ్చే ఛోటామోటా నేతలకు పంచేయడం చూస్తుంటే ఎంత బరితెగింపో ఇట్టే అర్ధమవుతోంది. శనివారం కొందరు విచారణాధికారులు భూ భాగోతాలను విచారించినట్టు సింహాచలంలో కోడైకూస్తోంది. గత అవినీతితో పాటు తాజాగా దేవస్థానంలోకి అడుగుపెట్టిన కొద్ది మాసాల్లోనే జరిగిన అవినీతి దందాను గుచ్చిగుచ్చి ప్రశ్నించినట్టు చెబుతున్నారు. ఇటీవల కాలంలో సింహాచలం భూముల్లో జరిగిన అక్రమ నిర్మాణాలను ఎందుకు వదిలేశారన్న దానిపై లోతుగా లెక్కలు తీస్తున్నట్టుగా పుకార్లు షికారు చేస్తున్నాయి. లీగల్ ఏఈఓ, రెవెన్యూ ఏఈఓలను వెంటేసుకుని మరీ జారీ చేసేసిన ఎనఓసీల లెక్క తేలుస్తున్నారని వినికిడి. బీఆర్‌టీఎస్ రోడ్డు వెంబడి నిర్మిస్తున్న భవనాలలో ఎంత పెద్ద అవినీతి జరిగిందో అన్నది ఏసీబీ అధికారులు నిగ్గు తేలుస్తున్నారు. చిన్న చిన్న స్థలాలు పోయిన వారు సైతం కమర్షియల్ కాంప్లెక్స్‌లు, కళ్యాణ మండపాలు ఎలా నిర్మిస్తున్నారని అందుకు దేవస్థానం అధికారులు ఇచ్చిన అనుమతుల చిట్టా ఏసీబికి చిక్కింది. ఆ చిట్టా ఆధారంగా ఒక్కో నిర్మాణం వెనుక అసలు కథలను ఇప్పటికే ఓ ఉన్నతాధికారి సేకరించారు. అనంతపురం నుంచి బదిలీపై వచ్చిన సింహాచలం భూముల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వద్ద అక్రమార్కుల చిట్టా మొత్తం ఉంది. ఆ చిట్టా ఆధారంగానే అనధికారిక నిర్మాణాలకు నోటీసులు జారీ చేస్తున్నారు. అయితే ఆ నోటీసులను జారీ చేయకుండా ఒత్తిడి చేసే పనిలో అయ్యవారున్నారని...ఆయన కారణంగానే అసలు పీఠ ముడి వీడడం లేదన్నది బహిరంగ రహస్యం.

# బెంగాల్ రాజకీయాల్లో సీఎం రమేశ్ చిచ్చు

**మొదటి పేజీ తరువాయి...**



19 మంది, రాజ్యసభలో ముగ్గురు) రెండు ప్రధాన హామీలతో ముందుకు వెళ్తున్నట్టుగా తెలుస్తోంది. మొదటిది వారి నియోజకవర్గాల అభివృద్ధిని కేంద్ర ప్రభుత్వం చూసుకుంటుంది, తద్వారా ఓటర్లలో అసంతృప్తి ఉండదు. రెండోది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచే కాకుండా, స్థానిక పోలీసులు, సీఐడీ కేసుల నుండి కూడా ఇబ్బందులు ఉండకూడదనే కండిషన్స్ పెట్టినట్టుగా ప్రచారం నడుస్తోంది. ఈ హామీలకు బదులుగా వారు చేయాల్సిందల్లా సంతకం పెట్టడమే. అయితే ఈ వ్యవహారంలో ఎటువంటి డబ్బు లావాదేవీలు జరగలేదని సీఎం రమేష్ స్పష్టం చేశారు. 'ఇది డబ్బు కోసమో, పదవుల కోసమో లేదా కమర్షియల్ కోణంలోనో జరిగింది కాదు.' అని ఆయన ఖండించారు. అయితే ఈ తిరుగుబాటు వెనుక సీఎం రమేష్ అంత పెద్ద శక్తేమీ కాదని మమతా బెనర్జీ నమ్మకస్థురాలు, టీఎంసీ ఎంపీ మహువా మోయిత్రా కొట్టిపారేశారు. 'సీఎం రమేష్ నాకు మంచి మిత్రుడు. రాజకీయాల్లో ఎప్పుడూ వార్తల్లో ఉండటం ఆయనకు ఇష్టం. మాలో కొందరం క్షేత్రస్థాయిలో ఉంటూ పాలిటిక్స్‌లో రాణిస్తే, మరికొందరు మంచి నెట్‌వర్క్ ద్వారా గుర్తింపు పొందుతారు. రమేష్ ఎప్పుడూ బీజేపీకి తన ప్రాధాన్యతను నిరూపించుకోవాలని చూస్తుంటారు. ఇది బెంగాల్‌లో కేక్ బేకింగ్ లాంటిది. ఆ కేక్ తయారుచేసేది ఆయన కాదు, దానికి కావాల్సిన సామాగ్రి ఆయనవి కావు. కానీ, అక్కడ కేక్ తయారవుతుంటే.. మధ్యలో వచ్చి నేను కూడా ఒక 'కిస్మిస్' వేస్తాను అని క్రెడిట్ తీసుకోవాలని ఆయన చూస్తున్నారు.' అంటూ మహువా మోయిత్రా ఎద్దేవా చేశారు.

# ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

## నియమించిన కేంద్ర ప్రభుత్వం

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ ను తదుపరి చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ గా నియమిస్తూ భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ చేయబోతున్నారు . ధీరజ్ సేథ్ జూన్ 30 మధ్యాహ్నం నుంచి ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన పదవీకాలం 2028 ఆగస్టు 31 వరకు కొనసాగనుంది. నేషనల్ డిఫెన్స్ అకాడమీ , ఖడక్వాస్లా పూర్వ విద్యార్థి అయిన ధీరజ్ సేథ్ 1986లో భారత సైన్యంలో చేరారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సైన్యంలో వివిధ హోదాల్లో పని చేశారు. ధీరజ్ సేథ్ దక్షిణ కమాండ్, దక్షిణ పశ్చిమ కమాండ్‌లకు సారథ్యం వహించడంతో పాటు, ఆర్మీ ప్రధాన కార్యాలయంలోనూ కీలక పదవులు చేపట్టారు. సైన్యంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు పరమ్ విశిష్ట సేవా మెడల్ , ఉత్తమ్ యుద్ధ సేవా మెడల్ , అతి విశిష్ట సేవా మెడల్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి.

# ఉక్కు ఘటనలో మరొకరు మృతి

**మొదటి పేజీ తరువాయి...**

ఆ కుటుంబం అనాధగా మారింది. బాధిత కుటుంబాలకు ప్రస్తుతం వారు నివసిస్తున్న పట్టణంలోనే శాశ్వత నివాసం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. బాధిత కుటుంబాల పిల్లలందరికీ ఉచిత విద్యను అందిస్తారు. ప్రతి బాధిత కుటుంబం నుండి ఒకరికి పర్మినెంట్ జాబ్ ఇస్తారు. ఇది రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సైతం వర్తిస్తుంది. ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించి కార్మికులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి కుమారస్వామి ప్రకటించారు. ప్రధానమంత్రి సహాయ నిధి ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాధిత కుటుంబాలకు పరిహారం ప్రకటించారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 అందిస్తాం. ఇన్సూరెన్స్, ఇతర ప్రయోజనాలతో కలిపి, బాధిత కుటుంబాలకు సుమారు రూ. 38 లక్షల వరకు ప్రయోజనం చేకూరుతుందని' కుమారస్వామి అన్నారు. మొత్తంగా కోటి 72 లక్షల మేర ప్రయోజనాలు అందుతాయన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలోని స్టీల్ మెల్ట్ షాప్ లో సోమవారం ఘోర ప్రమాదం సంభవించింది. కార్మికులు పని చేస్తున్న సమయంలో సుమారు 150 టన్నుల ద్రవపు ఉక్కుతో ఉన్న లాడిల్ ఒక్కసారిగా పేలిపోయింది. దాదాపు 1,540 డిగ్రీల వేడితో మరుగుతున్న ఉక్కు ద్రవం కార్మికులపై పడటంతో 8 మంది అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. తీవ్రంగా గాయపడిన మరో ఆరుగురు కార్మికులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఊహకందని ఈ దుర్ఘటన స్టీల్ ప్లాంట్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో ఇప్పటికే 22 మంది అధికారుల్ని సస్పెండ్ చేశారు.

# నైరుతి జోరు..!

**మొదటి పేజీ తరువాయి...**

మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశముందని స్పష్టం చేసింది. ఉరుములు, మెరుపుల్లు పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద ఉండొద్దని, అలాగే భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని ఆయన సూచించారు. ఈ సమయంలో ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు. భారీ వర్షాల క్రమంలో బయటకు రావొద్దని సూచించారు. ఆదివారం శ్రీకాకుళం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తు నిర్వహణశాఖ స్పష్టం చేసింది. మిగతా 23 జిల్లాల్లో కొన్నిప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని తెలిపింది. అయితే శనివారం సాయంత్రం 6 గంటల నాటికి మార్కాపురం జిల్లా కోవిలంపాడులో 41మిమీ, అనంతపురం జిల్లా తెరన్నపల్లిలో 24మిమీ, వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురంలో 22.5 మిమీ వర్షపాతం రికార్డైందని ప్రఖర్ జైన్ చెప్పారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలన్నారు. ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. నైరుతి రుతుపవనాల రాకతో ఏపీలో విస్తారంగా వానలు పడుతున్నాయి. ఇప్పటికే వర్షాలు మొదలయ్యాయి. పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్లు జలమయడం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక పలుచోట్ల చెట్లు విరిగి రోడ్లపై పడుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. నైరుతి రుతుపవనాలు ఇప్పుడే మొదలుకావడంతో రానున్న కొద్ది నెలల పాటు వర్షాలు బీభత్సం సృష్టించే అవకాశముంది.

# రూ.30 వేల ప్రోత్సాహం... జీవితాంతం తల్లిదండ్రుల భారం

## మాజీ మంత్రి అమర్

వైస్సార్సీపీ తలపెట్టిన వెన్నుపోటుకు రెండేళ్లుకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతల మీడియా సమావేశాలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర వాగ్వాదాలకు దారితీశాయి. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి కూటమి ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్, హోం మంత్రి వంగలపూడి అనితలపై ఘాటు విమర్శలు చేశారు. సెటైర్లు, రాజకీయ పదప్రయోగాలు, ఎద్దేవాలతో నిండిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి.

గుడివాడ అమర్నాథ్ తన ప్రసంగంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని లక్ష్యంగా చేసుకుని తీవ్ర సెటైర్లు వేశారు. "లోక నాయకుడు కమల్ హాసన్ అయితే, లోక మాయకుడు చంద్రబాబు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చంద్రబాబు రాజకీయాల్లో అనేక రూపాలు ధరించి ప్రజలను మభ్యపెడుతున్నారని, ఆయన రాజకీయ ప్రయాణం మొత్తం మాయాజాలంతో నిండిపోయిందని విమర్శించారు. "దశావతారాలు చంద్రబాబు" అంటూ చేసిన ఎద్దేవా సభలో చర్చకు దారితీసింది.

ఇక నారా లోకేశ్‌పై కూడా అమర్నాథ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "బాబు ఏక్ నెంబర్, బేటా దస్ నెంబర్" అంటూ తండ్రి కొడుకుల రాజకీయ శైలిని విమర్శించారు. గత రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ, "మామను వెన్నుపోటు పొడిచి చంద్రబాబు సీఎం అయ్యారు" అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల ద్వారా తెలుగుదేశం పార్టీ ప్రారంభ దశల రాజకీయాలను గుర్తు చేస్తూ చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు.

భూముల కేటాయింపుల అంశాన్ని కూడా అమర్నాథ్ ప్రధానంగా ప్రస్తావించారు. విశాఖ నగరంలో భూములను కొందరికి అనుకూలంగా కేటాయించారని ఆరోపిస్తూ, "అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు ఆంధ్రజ్యోతికి భూములు ఇచ్చారు" అని విమర్శించారు. విశాఖలో భూములను "పప్పు బెల్లాల్లా పంచేస్తున్నారు" అని ఆరోపిస్తూ, ప్రజా ఆస్తులను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారని అన్నారు.

ఇటీవల చంద్రబాబు ప్రజలు ఎక్కువ మంది పిల్లలను కనాలని సూచించడం, ప్రతి అదనపు సంతానానికి




ప్రభుత్వం రూ.30 వేల ప్రోత్సాహకం ఇవ్వాలనే ప్రతిపాదనపై కూడా అమర్నాథ్ విమర్శలు గుప్పించారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ఒక చిన్నారిని పెంచడం అంటేనే మధ్యతరగతి కుటుంబాలకు భారంగా మారిందని ఆయన అన్నారు. విద్య, వైద్యం, పోషకాహారం, నివాసం, ఉపాధి వంటి అవసరాల ఖర్చులు అమాంతం పెరిగిపోయిన వేళ కేవలం కొద్ది మొత్తాన్ని ఇచ్చి ఎక్కువ మంది పిల్లలను కనమని ప్రోత్సహించడం బాధ్యతారాహిత్యమని వ్యాఖ్యానించారు. "పిల్లలు కనండి అంటారు... పెంపకం ఖర్చులు ఎవరు కడతారు?" అంటూ ఆయన వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఒక పిల్లవాడి చదువు కోసం లక్షల రూపాయలు ఖర్చు అవుతున్న పరిస్థితుల్లో రూ.30 వేల ప్రోత్సాహకం కుటుంబ భవిష్యత్తును భద్రపరచలేదని అన్నారు. జనాభా పెరిగితే ఉద్యోగ అవకాశాలపై ఒత్తిడి, సహజ వనరుల కొరత, పట్టణాలపై భారాలు మరింత పెరుగుతాయని హెచ్చరించారు. ముందుగా యువతకు ఉపాధి, రైతులకు స్థిర ఆదాయం, కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అమర్నాథ్ విమర్శించారు.

రాష్ట్ర ప్రజలు నాలుగోసారి చంద్రబాబును నమ్మి మోసపోయారని అమర్నాథ్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయిందని, రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టే విధంగా నిర్ణయాలు తీసుకుంటోందని మండిపడ్డారు. పెట్టుబడిదారులు విశాఖ, అనకాపల్లి ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు భయపడుతున్నారని, కొందరు ఎమ్మెల్యేల భూ కబ్జాల వల్ల వైజాగ్ ప్రతిష్ట దెబ్బతింటోందని విమర్శించారు.

అదేవిధంగా, సీఎం మరియు డిప్యూటీ సీఎం ముందుగా తమ పార్టీ ఎమ్మెల్యేలను అదుపులో పెట్టాలని ఆయన సూచించారు. కేవలం కలెక్టర్లు, ఎస్పీలపై ఒత్తిడి తెచ్చే బదులు, స్థానిక ప్రజాప్రతినిధుల ప్రవర్తనను నియంత్రించడంపైనే ప్రభుత్వం దృష్టి పెట్టాలని అన్నారు.

మరోవైపు మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి కూడా హోం మంత్రి వంగలపూడి అనితపై తీవ్ర విమర్శలు చేశారు. స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ వ్యవహారంలో అసలు బాధ్యులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. "స్కామ్‌లో పాత్రధారులు ఎంతమందైనా, సూత్రధారి చంద్రబాబే" అని ఆమె పేర్కొన్నారు. రాజకీయ కక్షతోనే అరెస్టులు జరిగాయని, వైఎస్సార్‌సీపీ నాయకులపై ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు.

పుష్పశ్రీవాణి తన ప్రసంగంలో మరింత సెటైరికల్ వ్యాఖ్యలు చేస్తూ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని సంక్షేమ పథకాల ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దితే, చంద్రబాబు నాయుడు స్కామ్‌ల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి ఎన్నికల మేనిఫెస్టో అమలుపై కన్నా "రెడ్‌బుక్ రాజకీయాల"పైనే ఎక్కువ శ్రద్ధ ఉందని మండిపడ్డారు. "సీబీఎన్‌లో 'సీ' అంటే చీటింగ్, 'బీ' అంటే బాదుడు, 'ఎన్' అంటే నేరాలు" అంటూ ఎద్దేవా చేశారు. అలాగే "ఎన్డీయేలో 'ఎన్' అంటే నేరాలు, 'డీ' అంటే దోపిడీ, 'ఏ' అంటే అరాచకాలు" అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రజలకు పాలన కంటే ప్రచారమే ఎక్కువగా కనిపిస్తోందని, సంక్షేమం కంటే స్కామ్‌ల వార్తలే రాష్ట్రాన్ని వెంటాడుతున్నాయని అన్నారు.

పుష్పశ్రీవాణి కూటమి ప్రభుత్వ పాలనపై కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పరిపాలన గందరగోళంగా మారిందని, ముఖ్యంగా విద్యారంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం వల్ల నిరాశ పెరుగుతోందని అన్నారు.

ఈ మీడియా సమావేశాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో రాజకీయ దాడి చేశారు. చంద్రబాబు నాయుడు రాజకీయ శైలి, భూముల కేటాయింపులు, జనాభా పెంపు ప్రతిపాదనలు, స్కామ్ ఆరోపణలు, రాజకీయ కక్ష సాధింపు, ఎమ్మెల్యేల వ్యవహారశైలి వంటి అంశాలు ఈ విమర్శల్లో ప్రధానంగా నిలిచాయి. సెటైర్లు, పదప్రయోగాలు, వ్యంగ్య వ్యాఖ్యలతో సాగిన ఈ మీడియా సమావేశాలు రాష్ట్ర రాజకీయాల్లో మరింత వేడి రేపే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# గోసంరక్షణ సమాజ శ్రేయస్సుకు, ధర్మ పరిరక్షణకు పునాది

**డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే.**

**గూడూరు (జయ జయహే)**

భారతీయ సంస్కృతిలో గో సంరక్షణకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని, ఆర్థిక, వ్యవసాయ, ఆధ్యాత్మిక జీవన విధానాలకు ఆధారంగా భావించబడుతున్న గోసంరక్షణ ద్వారా వ్యవసాయం బలోపేతమవడమేకాకుండా, ప్రకృతి సమతుల్యత పరిరక్షించ బడుతుందని అందువల్ల గోసంరక్షణ కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు, సమాజ శ్రేయస్సుకు మరియు ధర్మ పరిరక్షణకు పునాదిఅని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గూడూరు మండలం, వై. కానాపూర్ గ్రామంలోని శివాలయంనందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజులు దమాం జగదీశ్ చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలి నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో పూజారి మద్దిలేటి, సత్సంగసభ్యులు యు.ఈరన్న, యు. చిన్నరాముడు, చదువులన్న, జయరాములు, రామాంజనేయులుతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.




# బీచ్ షాక్స్-విశాఖ ప్రశాంతతకు షాక్

**బీచ్ షాక్స్ - విశాఖ భద్రతకు షాక్.. ఐద్వా విశాఖపట్నం జిల్లా**

**విశాఖపట్నం (జయ జయహే)**

విశాఖపట్నం జిల్లా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ( ఐద్వా ) మహిళా సంఘాల ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఆర్కే బీచ్ తీరాన బీచ్ షాక్స్ కాదు - మహిళలకు భద్రత కావాలి, గోవా కల్చర్ కాదు - ప్రశాంతమైన విశాఖ కావాలి అన్నా నినాదాలుతో దద్దరిల్లిన విశాఖ సాగర తీరం. రాష్ట్ర కూటమి ప్రభుత్వం క్యాబినెట్లో పర్యాటకం పేరుతో బీచ్ షాక్స్ మద్యాన్ని వ్యాపారాన్ని ప్రభుత్వం ప్రోత్సహించడానికి మహిళా సంఘాలు ముక్తకంఠంతో ఖండిస్తూ తక్షణమే ఈ పాలసీని వెనక్కి తీసుకొని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ఐద్వా ప్రధాన కార్యదర్శి ప్రభావతి మాట్లాడుతు రాష్ట్ర బీచ్ కి వచ్చేవాళ్ళు టీ తాగడానికి వస్తారా ? ఓ బీరో, బ్రాందీనో తాగిపోతారు అని గౌరవ అసెంబ్లీ స్పీకర్ పదవిలో ఉన్న అయ్యన్నపాత్రుడు మాట్లాడడం సిగ్గుచేటని , స్పీకర్ పదవికి అనర్హుడుని , స్పీకర్ పదవికి తక్షణమే రాజీనామా చేయాలి, విశాఖపట్నం అంటే సనాతన ధర్మానికి, విద్య నిలయాలకి , సంస్కృతి సాంప్రదాయాలకు నిలయం. అటువంటి విశాఖ ని మద్యం సంస్కృతిగా మార్చడం కూటమి ప్రభుత్వానికి తగునా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ అంటే ఇదేనా, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం ఆధ్యాత్మికత అంటే ఇదేనా మంత్రి నారా లోకేష్ మహిళలకు ఇచ్చే గౌరవం, రక్షణ ఇదేనా, మహిళా సంఘాలు ప్రశ్నిస్తున్నాయిని తెలిపారు . విశాఖ జిల్లా ఐద్వా ప్రధాన కార్యదర్శి సత్యవతి మాట్లాడుతు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విశాఖపట్నం గంజాయి, మత్తు పదార్థాలకు కేంద్రంగా ఉందన్న నాయకులు నేడు అధికారంలోకి వచ్చాక విశాఖపట్నం ప్రశాంతతను విష సంస్కృతిగా మార్చడం ఏంటని , విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా పెడతామన్న కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నేడు మద్యం రాజధానిగా పెడతారా, బీచ్ షాక్స్ నిర్ణయం వెనక్కి తీసుకోపోతే, మహిళా సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించి రాష్ట్ర ప్రభుత్వాన్ని మార్చే శక్తి మహిళలకు ఉందని హెచ్చరించారు. మహిళా సంఘాలు మహిళా సంఘం నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మెగా ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు

**మధురవాడ,జయ జయహే**




ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం (జూన్ 14) మధురవాడ 6 వార్డు పరిధిశ్రీవల్లీనగర్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు హజరత్ ముక్తియార్ అలీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.డి. ఫక్రుద్దీన్ (అహమ్మద్) తెలిపారు.శనివారం వల్లీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇండియన్ రెడ్ క్రాస్ మరియు అపోలో హాస్పిటల్స్ సంయుక్త సహకారంతో ఆదివారం ఉదయం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కానుందని వెల్లడించారు. ఈ మెగా శిబిరాన్ని జిల్లా కలెక్టర్ అభిషిక్త కిషోర్, పోలీస్ కమిషనర్ శంకర్ బ్రత బాగ్చి, ప్రారంభించనున్నట్లు తెలిపారు. శిబిరంలో భాగంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వచ్చే రక్తదాతలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలు, యువత, స్వచ్ఛంద రక్తదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాలకు: 9505049933, 9490110122 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.



# 100 పడకల ఆసుపత్రి నిర్మాణమే లక్ష్యం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం జనసైనికులు విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా శేషగిరి హాస్పిటల్స్ అధినేత, జనసేన యువ నాయకుడు డాక్టర్ తోపరాల కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నాయకత్వంలో నిడదవోలులోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆధునిక ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

గత ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధి పేరుతో కేవలం జీవోలు జారీ చేసి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం జీవోలతో కాకుండా పునాదిరాళ్లతో సమాధానం చెబుతుందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు హడావుడిగా శంకుస్థాపనలు చేసే సంస్కృతి తమది కాదని స్పష్టం చేశారు.

పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది నియామకం లేకుండా కేవలం భవనాలు నిర్మించడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని ప్రశ్నించారు. అన్ని అనుమతులు, మౌలిక సదుపాయాలు, వైద్య సిబ్బంది నియామకాలతో నిడదవోలులో 100 పడకల ఆసుపత్రిని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిడదవోలును రూ.500 కోట్లతో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నిడదవోలు మున్సిపల్ మాజీ చైర్మన్ భూపతి ఆదినారాయణ, నిడదవోలు మండల జనసేన అధ్యక్షుడు పోలిరెడ్డి వెంకటరత్నం, నిడదవోలు నియోజకవర్గ జనసేన నాయకులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.




# ఇంటి చోరీ కేసును ఛేదించిన సమిశ్రగూడెం పోలీసులు...

**నిందితుడి అరెస్ట్, 63 గ్రాముల బంగారం స్వాధీనం..**

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ పీవీజీ తిలక్ మాట్లాడుతూ, నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో ఇటీవల జరిగిన ఇంటి చోరీ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.దర్యాప్తులో భాగంగా సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరా ఫుటేజ్‌లు, అనుమానితుల కదలికలను విశ్లేషిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన సమిశ్రగూడెం ఎస్సై బాలాజీ సుందర్ నేతృత్వంలోని క్రైమ్ టీం మరియు వారి సిబ్బందితో నిందితుడు అయిన గోడి సతీష్ కుమార్‌ను గుర్తించి నిడదవోలు మండలం డి.ముప్పవరం గ్రామంలో అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. గోడి సతీష్ కుమార్‌ను విచారించగా, కొవ్వూరు సబ్‌డివిజన్‌తో పాటు పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన ఇంటి చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు తెలిపారు.నిందితుడి వద్ద నుంచి చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని, మొత్తం 63 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు సీఐ గారు తెలిపారు.దర్యాప్తులో నిందితుడిపై వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మొత్తం తొమ్మిది చోరీ కేసులు ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు దొంగసొత్తును స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఎస్సై బాలాజీ సుందర్ నేతృత్వంలోని క్రైమ్ టీంను సీఐ పీవీజీ తిలక్ ప్రత్యేకంగా అభినందించారు. వారి కృషిని గుర్తిస్తూ సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బందికి రివార్డులు అందజేసినట్లు తెలిపారు

# చిన్నారి జ్ఞానేశ్వరి ఎక్కడ..?

**మొదటి పేజీ తరువాయి...**

ఆమెతో పాటే వెళ్ళింది. వారం రోజుల క్రితం చిన్నారితో పాటే మిస్ అయిన ఈ కుక్క.... నాలుగు రోజుల క్రితం ఒంటిపై గాయాలతో ఒంటరిగా ఇంటికి తిరిగి వచ్చింది. అయితే ఇంటికి వచ్చినప్పటి నుంచి ఈ మూగజీవం గతానికి భిన్నంగా ప్రవర్తించింది. విపరీతంగా అరుస్తూ, కరుస్తూ పిచ్చి పిచ్చి చేష్టలు చేసింది. శనివారం ఉదయం తీవ్ర అనారోగ్యానికి గురై ఆ కుక్క ప్రాణాలు విడిచింది.

**జీపీఎస్ తో ప్రయత్నాలు..!**

నిజానికి ఈ కుక్క ప్రవర్తనను గమనించిన పోలీసులు.... దీని ద్వారా పాప ఆచూకీ కనుగొనవచ్చని భావించారు. ఇందులో భాగంగానే నిన్న పెంపుడు కుక్కకు జీపీఎస్ ట్రాకర్ అమర్చి బాలిక కోసం పరిసర ప్రాంతాల్లో



జల్లెడ పట్టారు. జీపీఎస్ అమర్చిన తర్వాత ఆ కుక్క దాదాపు 8 కిలోమీటర్ల మేర ప్రయాణించి మళ్లీ ఇంటికే తిరిగి వచ్చింది. నిన్న సాయంత్రం వరకు ఇంటి వద్దే తిరుగుతూ చిన్నారి కోసం వెతికిన కుక్క... ఇవాళ ఉదయానికి మరణించడం పలు అనుమానాలకు తావిస్తోంది. కుక్క మృతి చెందడానికి ముందు, దానికి పాప ఫోటో చూపించి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రస్తుతానికి పోలీసులు ఈ కేసును కిడ్నాప్ కోణంలోనే దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారి స్వయంగా అంత దూరం వెళ్లే వయసు లేదు కాబట్టి, కచ్చితంగా మనుషులే ఏదైనా చేసి ఉంటారని గట్టిగా అనుమానిస్తున్నారు. ఇప్పటివరకు చిన్నారికి సంబంధించిన మృతదేహం గానీ, ఎలాంటి కీలక ఆధారాలు గానీ లభించకపోవడంతో ఆమె బతికే ఉందనే ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. ఎవరైనా చిన్నారిని తీసుకెళ్లి ఉంటే, ఆమె సురక్షితంగా తిరిగొస్తుందని కుటుంబ సభ్యులు నమ్ముతున్నారు.

For a pure tomorrow..
జయహే



# కార్పొరేషన్ పనితీరు అధ్వాన్నం

## రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**

రాజమహేంద్రవరం నగర కార్పొరేషన్ పనితీరుపై తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్పోరేషన్ వ్యవస్థ ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని, నగరంలో పాలనాపరమైన, మౌలిక వసతుల కల్పన తీరు అధ్వాన్నంగా తయారైందని ఆయన విమర్శించారు. రాజమహేంద్రవరంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధి, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. నగరంలో ఆక్రమణలు విపరీతంగా పెరిగిపోయాయని, వాటిని తక్షణమే తొలగించాల్సిన అవసరం ఉందని గోరంట్ల డిమాండ్ చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుష్కరఘాట్‌లో పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయని మండిపడ్డారు. అక్కడ నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు నిర్మించి, పుష్కర ఘాట్ యొక్క సహజ సిద్ధమైన అందాన్ని, వ్యూని పూర్తిగా చెడగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు తాము ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, నక్కలవాగు, ధవళేశ్వరం వద్ద కొత్తగా మురుగునీటి శుద్ధి ప్లాంట్లను (ఎస్‌టీపీ) నిర్మించాల్సి ఉందన్నారు. రాజమహేంద్రవరానికి ఒక సమగ్ర డ్రైనేజీ సిస్టం రావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అలాగే, నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తామని, రాబోయే పుష్కరాల నాటికి గోదావరి నదిని పూర్తిగా కాలుష్యరహితంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఐదేళ్ల పాటు రాక్షస పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌కు, ఇప్పుడు ప్రభుత్వంపై నిరసన ర్యాలీలు చేసే అర్హతే లేదన్నారు. మద్యం కుంభకోణంలో అన్ని వేళ్లూ జగన్ వైపే చూపిస్తున్నాయని, ఈ లిక్కర్ స్కామ్‌లో అంతిమ లబ్ధిదారుడు ఆయనేననడానికి ఆధారాలు బయటపడుతున్నాయని పేర్కొన్నారు. అమరావతిలో వేలాది మందిని తరిమికొట్టి, దళితుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఘోరమైన ఘటనలు జగన్ పాలనలోనే జరిగాయని గుర్తుచేశారు. జగన్ మానసిక స్థితి తప్పి పిచ్చిగా మాట్లాడుతున్నారని, ఆయనను లండన్ పంపి ట్రీట్‌మెంట్ ఇప్పించాలని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వ తప్పులను సరిదిద్దుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ పథంలో ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు. ఈ ప్రెస్ మీట్‌లో రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్స్యేటి ప్రసాద్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, కడియం మండల అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, గంగిన హనుమంతరావు, నన్ను కృష్ణ, నిమ్మలపూడి రామకృష్ణ, బాబు ఖాన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# సుమిత్ర-సమతుల్యత మరియు జ్ఞానానికి ప్రతీక




**రామాయణంలో సుమిత్రా దేవి ఒక ప్రశాంతమైన కానీ అత్యంత విలువైన పాత్ర. ఆమె లక్ష్మణుడు మరియు శత్రుఘ్నుడులకు తల్లిగా మాత్రమే కాకుండా, సహనం, వివేకం , మరియు నిస్వార్థ ప్రేమ కు ప్రతిరూపం. కౌసల్యా కరుణకు, కైకేయి అహంకారానికి ప్రతినిధులైతే, సుమిత్ర సమతుల్యతకు ప్రతీక. ఆమె ధర్మం, కుటుంబం, మరియు మనసు మధ్య సమతుల్యతను కాపాడిన స్త్రీ. నేటి ప్రపంచంలో భావోద్వేగ కల్లోలాలు పెరుగుతున్న తరుణంలో, సుమిత్ర చూపిన ఆత్మనిగ్రహం , సమతుల్యం , మరియు జ్ఞానం మనకు ఒక నిత్య మార్గదర్శకం.**

### సుమిత్రా దేవి యొక్క ముఖ్య లక్షణాలు

సమతుల్యత: శ్రీరాముని అరణ్యవాస సమయంలో, సుమిత్ర తన కుమారుడు లక్ష్మణుడిని శ్రీరాముని వెంట పంపినప్పుడు, ఆమె మనసులో తల్లితనపు బాధ ఉన్నప్పటికీ, బయటకు మాత్రం శాంతి మరియు ధర్మబద్ధత మాత్రమే చూపింది. ఆమె లక్ష్మణుడికి చెప్పిన మాటలు నేటికీ ప్రసిద్ధి: " రాముడు నీకు దేవుడువంటి వాడు; సీతా నీకు మాతవంటి వారు. వారికి సేవ చేయడం నీ ధర్మం ." ఈ మాటల ద్వారా ఆమె చూపించింది: " భక్తి అంటే ఆత్మనిగ్రహం, ధర్మం అంటే సమతుల్యత ."

నిస్వార్థ ప్రేమ: సుమిత్ర తన తల్లితనాన్ని స్వార్థరహిత సేవగా మార్చింది. ఆమె తన కుమారుడిని శ్రీరాముని సేవకు అంకితం చేసింది, ఏ తల్లీ ఇష్టపడని విరహాన్ని ధర్మార్థం భరించింది. ఇది ఆమె తల్లితనం ఎంత విస్తృతమైందో తెలియజేస్తుంది: " ప్రేమలో ఆత్మత్యాగం ఉన్నప్పుడు అది దైవమవుతుంది ."

జ్ఞానం మరియు వివేకం: సుమిత్ర ఎప్పుడూ సంఘటనలను సమతుల్య దృష్టితో చూశింది. ఆమె కౌసల్య లేదా కైకేయి లాగా భావోద్వేగాల ఆధీనంగా ప్రవర్తించలేదు. తన మనసులోని " బాధను నియంత్రించి, ధర్మం మరియు కర్తవ్యాన్ని ముందుంచింది ."

### సుమిత్ర -- భావోద్వేగ మేధస్సు యొక్క ప్రతీక

సుమిత్ర పాత్రలో మనకు భావోద్వేగ మేధస్సు యొక్క అత్యంత అందమైన రూపం కనిపిస్తుంది. ఆమె తన భావాలను అణచిపెట్టకుండా, అవి తన నిర్ణయాలపై ప్రభావం చూపకుండా ఉంచింది. " సంక్షోభంలో ఉన్నప్పుడు, ఆత్మనిగ్రహమే నిజమైన బలం " అని ఆమె ప్రతి చర్య మనకు తెలియజేస్తున్నాయి.

నేటి సమాజంలో, భావోద్వేగాలు మన నిర్ణయాలను ప్రభావితం చేసే కాలంలో, సుమిత్ర లాంటి వ్యక్తులు శాంతి , వివేకం , మరియు సమతుల్య ఆలోచన కు ఆదర్శం.

### ఆధునిక ప్రపంచంలో సుమిత్రా దేవి ప్రాసంగికత

కుటుంబ సంబంధాలలో సమతుల్యత: సుమిత్ర మూడు రాణుల్లో మధ్యవర్తిగా వ్యవహరించింది. ఆమె ఎప్పుడూ వివాదాలను పెంచలేదు, పరిష్కారానికి దారితీసే మాటలు మాత్రమే పలికింది. నేటి కుటుంబ జీవనంలో కూడా, ఆమె చూపిన మధ్యమార్గం, సంయమనం, మరియు సహనం చాలా అవసరం.

నాయకత్వంలో శాంతి: సుమిత్ర తన మాటలతోనే కాదు, తన ప్రవర్తనతో కూడా శాంతిని వ్యాప్తి చేసింది. ఆధునిక నాయకులు కూడా ఆమెలాగా శాంతి ద్వారా మార్పు తీసుకురావడం నేర్చుకోవాలి.

మహిళా బలానికి కొత్త నిర్వచనం: సుమిత్ర బలం కత్తి లేదా కోపంలో కాదు, శాంతి మరియు ధైర్యంలో ఉంది. ఇది ఆధునిక మహిళలకు ఒక సందేశం --- బలం అంటే కేకలు కాదు, మనసు స్థిరంగా ఉంచడం.

### సుమిత్ర -- మాతృత్వం మరియు ధర్మం యొక్క సమన్వయం

సుమిత్ర పాత్రలో తల్లితనం మరియు ధర్మం మధ్య అద్భుతమైన సమన్వయం కనిపిస్తుంది. తన కుమారుడిని శ్రీరాముని సేవకు పంపుతూ, ఆమె రోదించలేదు, కానీ ఆశీర్వదించింది. అది కేవలం ఒక తల్లి కర్తవ్యమే కాదు --- " ఒక మహాత్మిక ఆత్మ యొక్క నిర్ణయం ."

ఆమె మాటల్లో మనకు ఒక సత్యం వినిపిస్తుంది: " కుమారుడు ధర్మ మార్గంలో నడిస్తే, తల్లి హృదయం సంతోషిస్తుంది; అది తల్లికి గొప్ప పుణ్యం ."

సుమిత్రా దేవి రామాయణంలోని అత్యంత 'శాంతమయిన కానీ ప్రేరణాత్మక పాత్రలలో ఒకరు.' ఆమె జీవితం మనకు నేర్పే పాఠం ఏమిటంటే: " నిశ్శబ్దం కూడా ఒక బలం; సమతుల్యం కూడా ఒక జ్ఞానం ."

నేటి వేగవంతమైన ప్రపంచంలో, ఎక్కడ భావోద్వేగాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయో, సుమిత్రా దేవి చూపిన " శాంతి, సమతుల్యత, మరియు ఆత్మనిగ్రహం " మనకు మార్గదర్శకాలు. ఆమె మనకు గుర్తుచేస్తుంది: " నిజమైన జ్ఞానం మాటల్లో కాదు, మనస్సు స్థిరత్వంలో ఉంటుంది ."

ప్రొఫెసర్
విశ్వేశ్వర రావు
చెనమల్లు



# మనిషి భవితవ్యానికి మూలాధారం కర్మఫలం

(సి.హెచ్.ప్రతాప్)

మనిషి జీవితం అనేక అనుభవాల సమాహారం. సుఖం, దుఃఖం, విజయాలు, అపజయాలు --- ఇవన్నీ ఎందుకు సంభవిస్తాయనే ప్రశ్న ప్రతి మనసులో ఎప్పుడో ఒకప్పుడు తలెత్తుతుంది. భారతీయ తత్వశాస్త్రం ఈ ప్రశ్నకు కర్మధర్మం అనే గొప్ప సిద్ధాంతంతో సమాధానం ఇస్తుంది. మనిషి ఆలోచనలు, మాటలు, చర్యలు కలిపి కర్మగా రూపుదిద్దుకుంటాయి. ఆ కర్మల ప్రభావమే భవిష్యత్తులో జీవన గమనాన్ని నిర్ణయిస్తుందని ఈ సిద్ధాంతం బోధిస్తుంది. ప్రతి మానవుడు తన దైనందిన జీవితంలో చేసే పనుల వెనుక ఒక ఉద్దేశం ఉంటుంది. ఆ ఉద్దేశం మంచిదైనప్పుడు ఫలితం కూడా శుభప్రదంగానే ఉంటుంది. మన ప్రాచీన గ్రంథాలు, ఉపనిషత్తులు కర్మ ప్రాధాన్యాన్ని ఎంతో వివరంగా వివరించాయి. మనిషి తన భాగ్యవిధాత తానేనని, తన రాతను మార్చుకునే శక్తి తన చేతుల్లోనే ఉందని ఈ సిద్ధాంతం స్పష్టం చేస్తోంది.

ఏ విత్తనం వేస్తే అదే మొక్క పెరుగుతుంది అనే ప్రకృతి నియమం మాదిరిగానే, మనిషి చేసిన పనులకు తగిన ఫలితాలు తప్పక వస్తాయని కర్మసిద్ధాంతం తెలియజేస్తుంది. మంచి ఆలోచనలు, సత్యవంతమైన ప్రవర్తన, సేవాభావం వంటి సత్కర్మలు శాంతి, ఆనందం, గౌరవాన్ని అందిస్తాయి. స్వార్థం, అహంకారం, అసత్యం వంటి దుష్కర్మలు బాధలను, కలహాలను, అసంతృప్తిని కలిగిస్తాయి. కర్మధర్మం భయపెట్టే సిద్ధాంతం కాదు; బాధ్యతతో జీవించమని సూచించే జీవన మార్గదర్శకం. ప్రకృతిలో ప్రతి శక్తి ఒక క్రమశిక్షణతో నడుస్తుంది. సూర్యుడు, చంద్రుడు, నదులు అన్నీ తమ ధర్మాన్ని నిర్వర్తిస్తున్నాయి. అలాగే మనిషి కూడా సాటి ప్రాణుల పట్ల దయతో, కరుణతో మెలగడమే నిజమైన మానవ ధర్మం. లోకంలో అధర్మం పెరిగినప్పుడు సమాజ సమతుల్యత దెబ్బతింటుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ నైతిక విలువలను కాపాడుకుంటూ జీవించడం అత్యవసరం.

వ్యక్తిగత జీవితంలో కర్మధర్మం అత్యంత ప్రాధాన్యాన్ని కలిగి ఉంది. ప్రతి చర్యకు ఫలితం ఉంటుందని తెలుసుకున్నప్పుడు మనిషి ఆలోచించి వ్యవహరిస్తాడు. మాటలో మర్యాద, పనిలో నిజాయితీ, ప్రవర్తనలో వినయం పెరుగుతాయి. ఇది వ్యక్తిత్వ వికాసానికి బలమైన పునాది. జీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటనను ఒక పాఠంగా స్వీకరించే మనస్తత్వం కూడా కర్మసిద్ధాంతం ద్వారా అలవడుతుంది. కష్టాలు వచ్చినప్పుడు కుంగిపోకుండా, అవి గత కర్మల ఫలితాలని గ్రహించి, వర్తమానంలో మంచి పనులు చేయడం వైపు అడుగులు వేయడానికి ఇది తోడ్పడుతుంది. అంతఃకరణ శుద్ధి, చిత్తశుద్ధితో చేసే పనులు మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తాయి. నిరంతరం ఆత్మపరిశీలన చేసుకుంటూ, తన లోపాలను సరిదిద్దుకునే వ్యక్తి సమాజంలో ఉత్తమ పౌరుడిగా ఎదుగుతాడు.

కర్మధర్మం కుటుంబ, సామాజిక్షలను కూడా ప్రభావితం చేస్తుంది. పరస్పర గౌరవం, నమ్మకం, సహకారం వంటి విలువలు సత్కర్మల ద్వారా బలపడతాయి. ఒక మంచి మాట మనిషి హృదయాన్ని గెలుచుకోగలదు. చిన్న సహాయం కూడా జీవితాంతం గుర్తుండిపోయే బంధాన్ని ఏర్పరచగలదు. అందుకే భారతీయ సంస్కృతి పరస్పర సేవే పరమధర్మం అని బోధించింది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో కానీ, సమాజంలో కానీ ఒకరికొకరు తోడుగా నిలవడం, కష్ట సమయాల్లో ఆదుకోవడం వంటివి కర్మ సిద్ధాంతం నేర్పే పాఠాలే. ఎదుటివారికి కీడు చేయకూడదనే భావన ప్రతి ఒక్కరిలో కలిగినప్పుడు సమాజంలో నేరాలు, ఘర్షణలు తగ్గుముఖం పడతాయి.

సమాజ శాంతి, నైతికత నిలవడానికి కూడా కర్మధర్మం ముఖ్యమైన ఆధారం. ప్రతి వ్యక్తి తన బాధ్యతను గుర్తించి ధర్మబద్ధంగా జీవిస్తే సమాజంలో అన్యాయం, హింస, ద్వేషం తగ్గుతాయి. సేవాభావం, దయ, సహనం వంటి విలువలు పెరుగుతాయి. ఒక వ్యక్తి చేసిన సత్కర్మ అనేక మందికి స్ఫూర్తిగా మారుతుంది. అందుకే మహనీయుల జీవితాలు యుగాల తరబడి ప్రజలకు మార్గదర్శకాలుగా నిలుస్తాయి. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే వ్యక్తులు ఎల్లప్పుడూ పూజించబడతారు. వారి త్యాగాలు, సేవలు రాబోయే తరాలకు ఆదర్శంగా నిలుస్తాయి. పర్యావరణాన్ని రక్షించడం, పశుపక్ష్యాదుల పట్ల కరుణ చూపడం కూడా ఈ కర్మధర్మంలో భాగమే.

అయితే కర్మధర్మాన్ని కేవలం విధి లేదా శిక్షగా చూడకూడదు. ఇది మార్పుకు, ఆత్మపరిశీలనకు అవకాశం ఇచ్చే తత్వం. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకునే అవకాశం ప్రతి మనిషికీ ఉంటుంది. మంచి ఆలోచనలు, సత్కార్యాలు, ధర్మపాలన ద్వారా జీవన గమనాన్ని మార్చుకోవచ్చు. ఇదే కర్మసిద్ధాంతంలోని గొప్ప ఆశావాదం. మనిషి పుట్టుకతోనే అన్ని శక్తులను పొంది ఉంటాడు, వాటిని ఏ విధంగా ఉపయోగించాలనేది అతని విచక్షణాజ్ఞానంపై ఆధారపడి ఉంటుంది. చెడు మార్గాన్ని వీడి సన్మార్గంలో పయనించడానికి ఎప్పుడూ సమయం మించిపోలేదు.

నేటి వేగవంతమైన జీవితంలో కర్మధర్మం మరింత అవసరంగా మారింది. పోటీ, ఆత్మకేంద్రిత జీవనం పెరుగుతున్న ఈ కాలంలో మానవీయ విలువలను కాపాడేది కర్మధర్మమే. చిన్న చిన్న మంచి పనులు --- ఆకలితో ఉన్నవారికి ఆహారం ఇవ్వడం, కష్టంలో ఉన్నవారిని ఆదుకోవడం, నిజాయితీగా జీవించడం --- ఇవన్నీ సమాజాన్ని మెరుగైన దిశగా తీసుకెళ్తాయి. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ మానవుల మధ్య దూరం పెరుగుతోంది, కానీ కర్మధర్మం హృదయాలను జోడిస్తుంది.

కర్మధర్మం మనిషికి కేవలం ఆధ్యాత్మిక బోధ మాత్రమే కాదు; అది బాధ్యతతో జీవించమనే శాశ్వత సందేశం. చేతుల్లోని ప్రతి ఆలోచన, ప్రతి మాట, ప్రతి చర్య భవిష్యత్తును నిర్మించే శక్తిగా మారుతుందని ఈ సిద్ధాంతం గుర్తుచేస్తుంది. ధర్మబద్ధమైన కర్మలతో జీవించినప్పుడు వ్యక్తిగత శాంతితో పాటు సమాజ సమగ్రత కూడా బలోపేతం అవుతుంది. ప్రతి ఒక్కరూ స్వార్థాన్ని వీడి, సార్వత్రిక శ్రేయస్సు కోసం పాటుపడినప్పుడే భూమిపై స్వర్గం సాక్షాత్కరిస్తుంది. నిష్కామ కర్మ ద్వారా అత్యున్నత స్థితిని చేరుకోవచ్చని మన పెద్దలు నిరూపించారు. ఆ మార్గంలో పయనిస్తూ జీవితాన్ని ధన్యం చేసుకోవడం ప్రతి మానవుడి ప్రథమ కర్తవ్యం.

# కోరికలను నెరవేర్చే భగవత్ ధ్వజము (జెండా)



## పరిహారం... ఏం చేయాలో చూడండి!!

(పుట్టా శ్రీనివాసరావు)

సనాతన సంప్రదాయంలో దేవాలయంపై ధ్వజం (జెండా) సమర్పించడం అనేది కేవలం ఒక ధార్మిక క్రియ మాత్రమే కాదు; అది భగవంతుని పట్ల శరణాగతికి, శ్రద్ధకు మన ప్రార్థనలను దివ్య శక్తులకు చేరవేసే అత్యంత ప్రభావవంతమైన మాధ్యమంగా పరిగణించబడుతుంది. ప్రాచీన నమ్మకాల ప్రకారం, దేవాలయాలపై రెపరెపలాడే ధ్వజం సానుకూల శక్తి (పాజిటివ్ ఎనర్జీ), అదృష్టం, విజయం దైవిక రక్షణకు చిహ్నంగా నిలుస్తుంది.

జీవితంలో నిరంతరం అడ్డంకులు ఎదురవుతుంటే... కోరికలు నెరవేరడం లేదంటే... నిలిచిపోయిన డబ్బు తిరిగి రావడం లేదంటే... ఉద్యోగం లేదా వ్యాపారంలో విజయం దక్కడం లేదంటే... ఇంట్లో ప్రతికూలత, రోగాలు, ఒత్తిడి లేదా అశాంతి నెలకొని ఉంటే... ఈ పరిహారం అత్యంత లాభదాయకంగా, మహిమాన్వితమైనదిగా పరిగణించబడుతుంది.

ఈ పరిహారాన్ని ఏదైనా శుభదినాన, ముఖ్యంగా మంగళవారం, గురువారం, శనివారం, పూర్ణిమ, అమావాస్య లేదా ఏదైనా పవిత్ర తిథి రోజున చేయడం శ్రేష్ఠమైనదిగా భావిస్తారు.

ఈ పరిహార ప్రభావం వల్ల కలిగే ఫలితాలు......

నిలిచిపోయిన పనులలో వేగం పెరుగుతుంది.

చిక్కుకుపోయిన డబ్బు తిరిగి వచ్చే అవకాశాలు మెరుగవుతాయి.

ఉపాధి , కొత్త ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

వ్యాపారంలో వృద్ధి, లాభాల మార్గాలు తెరుచుకుంటాయి.

ఇంట్లోని ప్రతికూల శక్తి క్రమంగా నశిస్తుంది.

దీర్ఘఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది.

కుటుంబంపై దైవిక రక్షణ ఎల్లప్పుడూ ఉంటుంది.

మనస్సులో సానుకూలత, ఆత్మవిశ్వాసం మరియు ప్రశాంతత ఏర్పడతాయి.

చాలా మంది అనుభవం ప్రకారం, ఈ పరిహారం చేసిన తర్వాత వారి జీవితాల్లో అద్భుతమైన మార్పులు వచ్చాయి. ఎప్పటి నుంచో నిలిచిపోయిన కోరికలు నెరవేరాయి, సంక్షోభాలు తొలగిపోయాయి జీవితంలోకి కొత్త శక్తి, అదృష్టం ప్రవేశించాయి.

అయితే గుర్తుంచుకోండి ఏ పరిహారానికైనా నిజమైన ఫలితం కేవలం సచ్చీలమైన శ్రద్ధ, సానుకూల కర్మలు భగవంతునిపై అచంచలమైన విశ్వాసం ద్వారానే లభిస్తుంది. తొందరపాటు, సందేహం , ప్రతికూల ఆలోచనలకు దూరంగా ఉండండి. మనస్సు పూర్తి విశ్వాసంతో భగవంతుని చరణాలకు సమర్పితమైనప్పుడు, అద్భుతాలు వాటంతట అవే జరుగుతాయి.

విశ్వాసం ఉంచండి... దేవుడి ఇంట్లో ఆలస్యం కావచ్చు కానీ అన్యాయం జరగదు. ఎక్కడ శ్రద్ధ ఉంటుందో, అక్కడ దైవకృప తప్పక వర్షిస్తుంది.పరిహార విధానం..........

ఉదయాన్నే స్నానాది కార్యక్రమాలు ముగించుకుని శుభ్రమైన వస్త్రాలు ధరించండి. మనసులో భగవంతుడిని స్మరించుకుంటూ, మీ కోరికను పూర్తి శ్రద్ధతో సంకల్ప రూపంలో మనసులో నిలుపుకోండి.

ఆ తర్వాత 7 వేర్వేరు దేవాలయాలలో 7 ధ్వజాలను (జెండాలను) సమర్పించండి. ధ్వజం ఎరుపు, కాషాయం లేదా పసుపు రంగులో ఉంటే అత్యంత శుభప్రదంగా పరిగణించబడుతుంది. ప్రతి ఆలయంలోనూ ధ్వజాన్ని సమర్పించేటప్పుడు నిష్కల్మషమైన మనసుతో ప్రార్థించండి మీ జీవితంలోని అడ్డంకులను తొలగించమని భగవంతుడిని వేడుకోండి.

గమనిక: ఈ పరిహారాన్ని ప్రదర్శన కోసం కాకుండా, పూర్తి శ్రద్ధ, విశ్వాసం, భక్తిభావంతో చేయాలి. దేవాలయాలపై ధ్వజం గాలితో పాటు రెపరెపలాడుతున్నప్పుడు, మీ ప్రార్థనలు కూడా దివ్య శక్తితో కలిసి బ్రహ్మాండంలోకి ప్రవహించి శుభ ఫలితాలను ఆకర్షిస్తాయని నమ్ముతారు. మరి ఎందుకు ఆలస్యం దేవాలయాలపై భగవత్ ధ్వజం ఏర్పాటు చేయండి. సర్వేజనా సుఖినోభవంతు...!

# నేడు విశాఖలో జాతీయ మార్వాడీ సమ్మేళనం




## సమ సమాజ స్థాపనలో అఖిల భారతీయ మార్వాడీలు

## జాతీయ అధ్యక్షులు పవన్ కుమార్ గోయంకా వెల్లడి

**విశాఖపట్నం, జూన్ 13, జయ జయహే :**

సమ సమాజ నిర్మాణంలో అఖిల భారతీయ మార్వాడి సమ్మేళన్ ముఖ్య భూమిక పోషిస్తుందని ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు పవన్ కుమార్ గోయంకా తెలిపారు. సామాజిక బాధ్యతతో పని చేస్తున్న తమ సంస్థ ఎన్నో విజయాలు సొంతం చేసుకుందని చెప్పారు రాజస్థాన్ సాంస్కృతిక మండలి భవనలో శనివారం జరిగిన పాత్రికేయులు సమావేశంలో ఆయన మాట్లాడారు. 1935లో కోల్ కత్త కేంద్రంగా ఆవిర్భవించిన అఖిల భారతీయ మార్వాడి సమ్మేళన్ 18 రాష్ట్రాలలో వివిధ శాఖల ద్వారా సేవలు అందిస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తిరుపతి, విజయవాడ, గుంటూరు, రాజమండ్రిలో తమ శాఖలు ఉన్నాయని తెలియజేశారు. ఈ శాఖలలో 500 మంది సభ్యులు ఉన్నట్లు పేర్కొన్నారు. కొత్తగా విశాఖపట్నంలోని పారిశ్రామిక ప్రాంతం గాజువాకలో నూతన, శాఖను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. విస్తృతంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో తమ సంస్థ సభ్యులు భాగస్వామ్యం అవుతున్నారవి ఆయన పేర్కొన్నారు. స్మార్ట్ సిటీ విశాఖపట్నంలో మొట్టమొదటిసారిగా తమ సంస్థ జాతీయ కార్యవర్గ సమావేశాన్ని ఈ నెల 14వ తేదీ ఆదివార నిర్వహిస్తున్నట్లు పవన్ కుమార్ గోయంకా తెలియజేశారు. పాత్రికేయుల సమావేశంలో అఖిల భారతీయ మార్వాడి సమ్మేళన్ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్ మిశ్రా, ప్రధాన కార్యదర్శి కేదార్నాథ్ గుప్తా, కోశాధికారి అనిల్ కుమార్ మాలావత్, సంయుక్త కార్యదర్శి పవన్ బన్సల్, పూర్వ కార్యదర్శి కైలాస్ తోది, ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షులు ఓం ప్రకాష్ అగర్వాల్, ప్రధాన కార్యదర్శి బాల కిషన్ లోహియా, విశాఖపట్నం శాఖ అధ్యక్షులు పొడేస్వర్ పురోహిత, ప్రధాన కార్యదర్శి రాజేష్ , కొఠారి, కోశాధికారి రాజేష్ బన్సల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాంద్ మాల్ అగర్వాల్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



# మృత్యువాత పడ్డ పాడి గేదెలకు పరిహారం పంపిణీ

**మాడుగుల,జూన్ 13, జయ జయహో**

ఇటీవల మృత్యు వాతకు గురైన పాడి గేదెలకి శనివారం సాయంత్రం భీమా నష్ట పరిహారం చెక్కులు పంపిణీ చేశారు.చోడవరంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాడుగుల మండలంలో మొత్తం 28 పశువులకు పరిహారం అందజేశారు.అందులో భాగంగా మాడుగుల పాల కేంద్రం సభ్యులు దాడి ముత్యాలు నాయుడు పాడి గేద చనిపోయినందున వారికి 50,000 రూపాయలు చెక్కు వారి భార్య దాడి రామయ్యమ్మకు అందజేసినట్లు పాలకేంద్రం సీఈవో జోగి నాయుడు తెలిపారు. పశువులకు ఇన్సూరెన్స్ చేయడం వలన డైరీ నుంచి సహాయము అందజేశారన్నారు.ఈ కార్యక్రమంలో విశాఖ డైరీ డైరెక్టర్ శ్రీరశిరెడ్డి సూర్యనారాయణ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయగా,డైరీ నుండి డిప్యూటీ మేనేజర్ జి రాము,సూపర్వైజర్ ఆర్ అప్పారావు, పాలకేంద్రం అధ్యక్షులు బండారు వరలక్ష్మి , కార్యదర్శి గండి జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు

# ఏపీకి కేంద్రం భారీ గ్రాంట్..

## పంచాయితీలకు పండగే...పండగ

**చోడవరం, జూన్ 13, జయ జయహే**



ఏపీకి కేంద్రం భారీ బడ్జెట్ మంజూరు చేసిందనీ దీంతో గ్రామపంచాయతీలకు మంచి ఊరట లభించినట్టు అయిందని స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ రాజు చెప్పారు. శనివారం సాయంత్రం మాట్లాడుతూ.. ఈ నిధులతో గ్రామాల్లో రోడ్డు సౌకర్యంతో పాటు మౌలిక వసతులు కల్పించుకోవచ్చన్నారు. 16వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు మొత్తం రూ.16,627 కోట్ల గ్రాంట్ మంజూరు చేయగా, బేసిక్ గ్రాంట్ కింద రూ.13,302 కోట్లు, పెర్ఫార్మెన్స్ గ్రాంట్ కింద రూ.3,225 కోట్లు మంజూరు చేసిందన్నారు.2026–27 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రారంభించి రాబోయే ఐదేళ్ల కాలంలో ఈ నిధులు వెచ్చించాల్సి ఉంటాది.ఈ నిధులను గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణకు ఖర్చు చేయాలి. అలాగే ఈ నిధుల నుంచి రోడ్ల పనులకు కేవలం10 శాతం వరకు మాత్రమే వెచ్చించాల్సి ఉంటుంది. మిగిలిన మొత్తాన్ని గ్రామంలో ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజల అవసరాల కోసం వినియోగించాలనీ కేంద్రం ఆదేశించిందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో నూతన పాలకవర్గాలకు ఇది శుభవార్త.



# స్టీల్ ప్లాంట్ మృతులకు రూ. కోటి పరిహారం ఇవ్వాల్సిందే!

## ఎల్జీ పాలిమర్స్ ఘటనలో జగన్ ఇచ్చారు

## కూటమి ఎందుకు ఇవ్వలేకపోతోందన్న వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆల్ఫా కృష్ణ

**విశాఖపట్నం, జూన్ 13, జయ జయహే**

ఎల్జీ పాలిమర్స్ ఘటనలో మృతుల కుటుంబాలకు రూ. కోటి నష్టం పరిహారం జగన్మోహన్ రెడ్డి అందజేసినట్టు స్టీల్ ప్లాంట్ ప్రమాద మృతులకు రూ. కోటి చంద్రబాబు ప్రకటించాలని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆల్ఫా కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మద్దిలపాలెంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఎక్కడా ఇలాంటి పరిహారం ఇవ్వలేదన్నారు. స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాలకు మాజీ ముఖ్యమంత్రి జగన్ తగిన ప్రధాన్యత ఇచ్చారన్నారు. విద్యా శాఖ మంత్రి లోకేష్ కార్మిక సంఘాలను కించపరిచేలా మాట్లాడడం సరికాదని చెప్పారు. స్టీల్ ప్లాంట్ అంశంలో చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. ఎల్జి పాలిమర్స్ ఘటనలో కంపెనీ ప్రతినిధులను తమ వైసిపి ప్రభుత్వం జైలుకు పంపిందని, ఎం ఎన్ సి కంపెనీ ప్రతినిధులను జైలుకు పంపిన చరిత్ర తమదని గుర్తు చేశారు. హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్థాయికి తగ్గట్టుగా మాట్లాడటం లేదన్నారు. హోం మంత్రి పనితీరు రాజ్యాంగ బద్ధంగా లేదని విమర్శించారు. తమ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి బయటకు వస్తే ఎందుకంత భయపడుతున్నారని ప్రశ్నించారు. కమ్యూనిస్ట్ నేతలను కాల్చిన ఘనత చంద్రబాబుదన్నారు. కార్పొరేట్ వర్గాలకు రూ. 99 పైసలకే భూములు కట్టబెట్టడం సంపద సృష్టా అని అడిగారు. మీడియా సమక్షంలో హోం మంత్రి అనిత చర్చకు రావాలని సవాల్ విసిరారు. ప్రజలకు చేసిన మంచిపై చర్చకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. హోం మంత్రి అనిత తీరు మార్చుకోవాలని, లేని పక్షంలో హోమ్ మంత్రి అనితకు ఇకపై ధీటుగా బదులిస్తామని చెప్పారు. ప్రజా సమస్యలపై పనిచేసే తమకు ప్రభుత్వం బెదిరిస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. వైఎస్. జగన్ ఆలోచనా విధానమే రాష్ట్ర అభివృద్ధికి శరణ్యం అని, ప్రజలు వైసిపి ప్రభుత్వం కావాలని కోరుకుంటున్నారన్నారు.

# హోం మంత్రి అనితపై వ్యాఖ్యలు ఖండిస్తూ టీడీపీ నేతల ఆగ్రహం

## గుడ్లు పగలగొట్టి నిరసన తెలిపిన టిడిపి మహిళలు.

**నక్కపల్లి జూన్ 13:( జయ జయహే)**

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ నక్కపల్లిలోని మంత్రి నివాసం వద్ద పాయకరావుపేట నియోజకవర్గ టీడీపీ నాయకులు, మహిళాలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ కోడిగుడ్లు పగలగొట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఇంటివద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర హోం మంత్రిగా అనిత సమర్థవంతంగా పనిచేస్తున్నారని అన్నారు. గతంలో ఏ హోం మంత్రి చేయని విధంగా ప్రజలకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర హోం మంత్రి ప్రస్తుతం ఉపయోగిస్తున్న



బుల్లెట్‌ప్రూఫ్ వాహనంపై గుడివాడ అమర్నాథ్ చేస్తున్న వ్యాఖ్యలు అవాస్తవమని, ఆ వాహనం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే కొనుగోలు చేసినదని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధికి అనిత కృషి చేస్తున్నారని, పరిశ్రమల ఏర్పాటుతో వేలాది ఉద్యోగ అవకాశాలు రానున్నాయని చెప్పారు. రెండు సంవత్సరాల్లో రూ.1,150 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. అనకాపల్లి జిల్లా టీడీపీ మహిళా నాయకురాలు రమాకుమారి, నియోజకవర్గ మహిళా కన్వీనర్ మునిషా బేగం లు మాట్లాడుతూ మహిళలను కించపరిచే విధంగా మాట్లాడటం తగదన్నారు. మహిళలను గౌరవించడం నేర్చుకోవాలని వైసీపీ నాయకులకు సూచించారు. భవిష్యత్తులో ఇటువంటి వ్యాఖ్యలు పునరావృతమైతే మహిళలు తీవ్రంగా స్పందిస్తారని హెచ్చరించారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ హోం మంత్రిపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సీఎం చంద్రబాబు దూరదృష్టితో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. హోం మంత్రి అనితను ఆదర్శంగా తీసుకుని మహిళలు ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని గుడివాడ అమర్నాథ్‌కు హితవు పలికారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, అయినంపూడి అప్పలరాజు , నల్లల రాజు వెంకటరాజు, నల్లల నరేష్ , గింజల శ్రీనివాసరావు, చిక్కాల శ్రీను, తోలేటి శ్రీను, వాసు, వంకా రమణ,మహిళా నాయకులు నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.



## సోనస్ కార్పొరేట్ క్రికెట్ లీగ్-2026

# కప్ ఆవిష్కరణ

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**

యువతను క్రీడలలో ప్రోత్సహించి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో సోనస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సోనస్ కార్పొరేట్ క్రికెట్ లీగ్–2026 టోర్నమెంట్ కప్‌ను ప్రముఖ ప్రవాస భారతీయుడు, సోనస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు మరియు సీఈవో డాక్టర్ జేమ్స్ వాట్స్ కొమ్ము శనివారం రాజమహేంద్రవరంలోని షెల్టాన్ హోటల్‌లో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 12 జట్లు పాల్గొనే ఈ పోటీలు శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఉద్యోగుల్లో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

సోనస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సహ వ్యవస్థాపకుడు సామ్యూల్ బాబు మాట్లాడుతూ, రెండో ఏడాది ఈ టోర్నమెంట్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రైవేటు సంస్థలు క్రీడలకు ప్రోత్సాహం అందించడం ద్వారా యువ క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు.


డాక్టర్ చిమ్మలరి శ్రీనివాస్ మాట్లాడుతూ, క్రికెట్ ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడే క్రీడ అని అన్నారు. సినీ నటుడు భద్రం మాట్లాడుతూ, డాక్టర్ జేమ్స్ వాట్స్ కొమ్ము యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటున్నారని కొనియాడారు. క్రీడలు గెలుపోటములను మాత్రమే కాకుండా జీవిత సవాళ్లను ఎదుర్కొనే ధైర్యాన్ని కూడా నేర్పుతాయని చెప్పారు.

ఈ సందర్భంగా డాక్టర్ చిమ్మలరి శ్రీనివాస్ రూపొందించిన “సోనస్ ఏఐ ఎనీ సెంట్స్ హబ్” సాఫ్ట్‌వేర్‌ను డాక్టర్ జేమ్స్ వాట్స్ కొమ్ము ఆవిష్కరించారు. జర్నలిస్టులకు ఉపయోగపడే ప్రత్యేక యాప్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని శ్రీనివాస్ తెలిపారు.


కార్యక్రమంలో టోర్నమెంట్‌లో పాల్గొనే 12 జట్ల కెప్టెన్లు, సోనస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం నగరంలో తొలిసారిగా ఈ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లను లైవ్ స్క్రీన్‌లపై ప్రసారం చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# క్యాన్సర్ పేషెంట్‌కు మురళి కృష్ణ రెడ్డి ఆర్థికసహాయం

**విశాఖపట్నం (జయ జయహే)**



కె ఎస్ ఎన్ ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామివేత్త కర్రి మురళి కృష్ణ రెడ్డి పుట్టిన రోజు సందర్బంగా క్యాన్సర్ తో బాధపడుతున్న మద్దిలపాలెం మూడు గుడుల ప్రాంతంలో నివసిస్తున్న గురుమూర్తి కి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందచేసి మనోధైర్యం తో ఉండాలని ధైర్యం చెప్పారు, 2026 లో 10 వ తరగతి, మరియు ఇంటర్ మెరిట్ విద్యార్థులకు ప్రైజ్ మనీ అందచేసారు ఈ సందర్బంగా కర్రీ మురళి కృష్ణ రెడ్డి మాట్లాడుతూ కె ఎస్ ఎన్ ఆర్ ట్రస్ట్ తరుపున అనారోగ్యం తో బాధపడుతున్న వారికి తన వంతు సహాయం అందిస్తాని తెలిపారు, అలాగే ప్రతి సంవత్సరం కష్ట పడి బాగా చదివే మెరిట్ విద్యార్థులకు ప్రైజ్ మనీ అందచేయనున్నట్లు తెలిపారు




# డా.బోస్ స్వీయ చరిత్ర గ్రంథావిష్కరణ

**భీమవరం (జయ జయహే)**

ప్రఖ్యాత ఇంద్రజాలికుడు, రచయిత మేజిక్ స్టార్ డా. బోస్ రచించిన స్వీయ చరిత్ర గ్రంథం ‘మెజీషియన్‌గా,రచయితగా 55 సంవత్సరాల నా ప్రస్థానం’ గ్రంథావిష్కరణ ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి క్యాంపు కార్యాలయం, పెద అమిరంలో జరిగింది. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు మనుమడు రాజశేఖర రెడ్డి చేతుల మీదుగా గ్రంథావిష్కరణ జరిగింది. ఆ గ్రంథాన్ని డా.బోస్ ఉప సభాపతి కనుమూరు రఘురామ కృష్ణరాజుకు అంకితం యిచ్చారు. ఆ సందర్భంగా బోస్ తాను మేజిక్ రంగంలోకి ప్రవేశించిన విధానాన్నీ, అటు పిమ్మట రచయితగానూ ఎలా మారినదీ తన ప్రసంగంలో వివరించారు. అనంతరం ఆయన కొన్ని మేజిక్ ట్రిక్కులను ప్రదర్శించి, ప్రేక్షకులను రంజింపజేసారు. రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ మేజిక్ రంగంలో బోస్ ఎంతో అనుభవం గల ప్రతిభావంతుడుయిన మెజీషియన్ అనీ, గతంలో బోస్ మేజిక్ ప్రదర్శనలను విజయవాడలో తాను తిలకించాననీ, తన తాతగారైన సిరీస్ రాజు కూడా బోస్‌తో కలసి మేజిక్ ప్రదర్శనలు యిచ్చేవారనీ గుర్తు చేసారు. సభా కార్యక్రమంలో వ్యాఖ్యాతగా బి. యస్.యన్.యల్. విశ్రాంత అధికారి వి.వి.యస్.యన్. రాజు వ్యవహరించారు.

# యోగాను పాఠ్యాంశంగా పాఠశాలల్లో ప్రవేశపెట్టాలి: ఎమ్మెల్యే కొణతాల





**అనకాపల్లి (జయ జయహే)**

యోగాంధ్ర 2026 సంవత్సరం యోగ వేడుకలు నిర్వహించారు జూన్ 21న జరుగ నున్న 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగాంధ్ర 2026 లో అనకాపల్లి గవరపాలెంలోని ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో శనివారం నిర్వహించిన యోగ సాధన కార్యక్రమం ద్విగజయముగా జరిగింది .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హాజరు పాల్గొన్నారు . యోగ సాధకులు వివిధ యోగ విన్యాసాలు ప్రదర్శించే మరియు చిన్నారులు నృత్య నాట్యాల పాటలతో యోగా ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ యోగాను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా విద్యార్థులు ఒక పాఠ్యాంశంలో భాగంగా చేర్చి ఇతర సబ్జెక్ట్స్ మాదిరిగానే పరీక్షలు నిర్వహించే విధానాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. పెరుగుతున్న చెడు వ్యసనాలు మొబైల్ ఫోన్లకు బానిసత్వం నైతిక విలువల కోల్పోవడం ఇలాంటి సమస్యలను అధిగమించాలంటే చిన్ననాటి నుంచే ఈ యోగా నైతిక విలువలు భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకు వెళ్లాలని, ఇది ఒక పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ప్రభుత్వ పాఠశాలలో యోగా బోధనలను విస్తరించే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. యోగ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత సానుకూల ఆలోచన విధానాన్ని మంచి విద్యా బుద్ధులను పెంపొందిస్తుందని ఆయన అన్న ప్రతిరోజు యోగా, ప్రాణాయామం ,ధ్యానం తను నిత్యం చేస్తానని ఇది ఆరోగ్యానికి ఎంతో మంచిది అని అనారోగ్యాలు మన దరికి చేరవని ముఖ్యంగా డయాబెటిస్, రక్తపోటు, హార్ట్ ఎటాక్ వంటి వివిధ రకాల వ్యాధుల నివారించడంలో యోగ శారీరక శ్రమ సమతుల్య ఆహారం కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలోని యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్య మంతమైన జీవితాన్ని పొందాలని అలాగే సమాజ నిర్మాణానికి కృషి చేయాలని అని ఆయన పిలుపునిచ్చారు ఈనెల జూన్ 21 బజ్జానకొండ సమీపంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లాస్థాయి అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో ప్రజలు విద్యార్థిని విద్యార్థులు స్వచ్ఛంద సంస్థలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిసి సుజాత, జీవీఎంసీ ఇంచార్జ కమిషనర్ లక్ష్మీ తులసి ,నోకాంబికా దేవస్థానం చైర్మన్ పి నాగ శ్రీను ( గొల్ల బాబు) డైరెక్టర్లు దేవస్థానం యువ శ్రీధర్ డీఈలు, ఏఈలు, వైద్యులు దేవాలయ సిబ్బంది యోగ శిక్షకులు పాల్గొన్నారు

# శ్రీ శ్రీ కళావేదిక అమెరికా పగ్గాలు జేమ్స్ వాట్ కొమ్ముకు

**రాజమండ్రి, జయజయహే బ్యూరో:**



తెలుగు సాహిత్య, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్న శ్రీ శ్రీ కళావేదిక సంస్థ అమెరికా దేశ ప్రతినిధిగా ప్రవాసాంధ్రుడు, రాజమండ్రికి చెందిన డాక్టర్ జేమ్స్ వాట్ కొమ్మును నియమించింది. శనివారం రాజమండ్రిలోని షెల్టాన్ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కో-ఆర్డినేటర్ కేతా శ్రీనివాసరావు చేతుల మీదుగా జేమ్స్ వాట్ కొమ్ముకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ, సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రపంచ మహాసభలను నిర్వహిస్తూ కవులు, రచయితలు, కళాకారులను ఒకే వేదికపైకి తీసుకువస్తున్నామని తెలిపారు. కళా, సాహిత్య రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని గుర్తించి సత్కరించడం సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. కేతా శ్రీనివాసరావు మాట్లాడుతూ, తెలుగు భాష, సంస్కృతిని అంతర్జాతీయ స్థాయిలో విస్తరించేందుకు శ్రీ శ్రీ కళావేదిక కృషి చేస్తోందన్నారు. అమెరికాలోని తెలుగు సంఘాలు, కళాకారులతో సమన్వయం పెంపొందించడంలో జేమ్స్ వాట్ కొమ్ము కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ జేమ్స్ వాట్ కొమ్ము మాట్లాడుతూ, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. రాబోయే ప్రపంచ మహాసభలను అమెరికాలో నిర్వహించేందుకు కృషి చేస్తామని, అక్కడి తెలుగు కళాకారులు, సాహితీవేత్తలకు మరింత ప్రాధాన్యత కల్పించే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అనంతరం పలువురు ప్రముఖులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, కళాకారులు, సామాజిక ప్రముఖులు పాల్గొన్నారు.

# చోడవరం శివాలయం పుష్కరిణి అభివృద్ధికి 108 నృత్త కరణ నిరాజనం

**చోడవరం జూన్ 13 జయ జయహే**



చోడవరంలో గల పురాతన స్వయంభు శ్రీ గౌరీశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో గల పుష్కరిణి అభివృద్ధికి విశాఖకు చెందిన నిర్మల నృత్య నికేతన్ వారు తమ నిరాజనంతో పుష్కరిని అభివృద్ధికి విరాళాలు సేకరించేందుకు ముందుకు వచ్చారు. దీంతో ఈ నెల 17న శివాలయం ప్రాంగణంలో 108 మంది నృత్య కళాకారులతో 108 నృత్త కరణ ప్రదర్శన చేయనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతి శనివారం తెలిపారు. విశాఖ చిన ముసిడివాడ శాంతినగర్ లో గల శ్రీ నిర్మల నృత్య నికేతన్ ప్రిన్సిపాల్ బి విజయ జ్యోతి ఆధ్వర్యంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు జరిగే ఈ ఆత్మీయ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్య



అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు హాజరవుతున్నారు. అలాగే ది డాన్స్ ఇండియా మ్యాగజైన్ ఎడిటర్ ఇన్ చీఫ్ బి ఆర్ విక్రమ్ కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు గూనూరు సురేష్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

**నృత్త కరణ నీరాజనం**

నాట్యానికి మూలమైన ఆ గౌరీశ్వరుడికి కరణ భంగిమల నీరాజనం గ్రామీణ ప్రాంతాల్లో కళా వికాసం లక్ష్యం గా సంప్రదాయ కూచిపూడి నృత్యాన్ని, నాట్యశాస్త్రాన్ని పరిచయం చేస్తూ అందులోని ప్రాథమిక అంశాలని నేటి తరానికి తెలియచేయడం మా సంస్థ శ్రీ నిర్మల నృత్య నికేతన్ లక్ష్యమని నృత్య నికేతన్ ప్రిన్సిపాల్ విజయ జ్యోతి పేర్కొన్నారు. కాబట్టి చోడవరం ప్రాంత ప్రజలు కళాభిమణులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పుష్కరిణి అభివృద్ధికి విరాళాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ పుష్కరిని అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్ రాజు ద్వారా ప్రభుత్వం 50 లక్షల రూపాయలు మంజూరు చేయగా వాటితో పనులు ప్రారంభించారు. కొందరు దాతలు కూడా ముందుకు వచ్చి విరాళాలు అందిస్తున్న నేపథ్యంలో, అధిక మొత్తంలో వ్యయమయ్యే అవకాశం ఉన్నందున దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## విద్యార్థులకు యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం

**చోడవరం జూన్ 13 జయ జయహే**

చోడవరం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీ విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో 100 రోజుల యాంటీ-డ్రగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎస్సై బి జగ్గారావు మాట్లాడుతూ..గంజాయి ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై చట్టపరమైన చర్యలు గురించి అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, వ్యక్తిగత సమాచారం, ఓటిపి లు బ్యాంకు వివరాలను ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. అలాగే మహిళలపై జరిగే నేరాలు వాటికి సంబంధించిన చట్టాలు, మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న చట్టపరమైన రక్షణలు, అత్యవసర సేవల వినియోగంపై విద్యార్థులకు వివరించారు. రోడ్డు భద్రతా నియమాల ప్రాముఖ్యత, హెల్మెట్ సీట్ బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ నియమాలను పాటించాల్సిన అవసరం గురించి అవగాహన కల్పించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సహాయం కోసం డయల్ 112 నెంబర్ ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు చోడవరం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## బీభత్సం సృష్టించిన గాలి వర్షం

### నేల కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

### అప్రమత్తమైన విద్యుత్ సిబ్బంది

**మాడుగుల జూన్ 13 జయ జయహే**

మాడుగుల మండలంలో శనివారం మధ్యాహ్నం సంభవించిన గాలి వర్షం బీభత్సాన్ని సృష్టించింది. ఊహించని రీతిలో మధ్యాహ్నం మూడు గంటల తర్వాత పెద్ద ఎత్తున గాలులు వీస్తూ వర్షం కురిసింది. పలు గ్రామాలలో చెట్లు విద్యుత్ స్తంభాలు నేలకొరిగి రాకపోకలకు విద్యుత్ సరఫరాలకు ఆటంకం కలిగించింది. విద్యుత్ సిబ్బంది తరపున పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. మాడుగుల పోలీస్ స్టేషన్ సమీపంలోను, టీచర్స్ కాలనీ వద్ద చెట్లు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అలాగే కేజీ పురం, ముకుందపురం తదితర గ్రామాల్లో కూడా తాటి చెట్లు విద్యుత్ స్తంభాలు నలుగురికి వైర్లు తెగిపడ్డాయి. ముఖ్యంగా అప్పలరాజు పురం 33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పనిచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో అనే గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. అప్రమత్తమైన మండల విద్యుత్ ఏఈ గంగాధర్, లైన్ ఇన్స్పెక్టర్ అప్పాజీ సిబ్బందితో ఆయా ప్రాంతాల్లో పర్యటించి ఎక్కడికక్కడ విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం

### పలు ప్రాంతాల్లో రహదారులు జలమయం

### అధికారులను అప్రమత్తం చేసిన సిఎం రేవంత్

### అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వెళ్లాలని ఆదేశం

**హైదరాబాద్,జూన్13 జయ జయహే**

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, సనత్ నగర్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, బోరబండ, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, హైదర్ నగర్, ప్రగతినగర్, మూసాపేట్ ప్రాంతాల్లో వర్షం పడుతోంది. శంషాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి జలమయమై చెరువును తలపిస్తోంది. రోడ్డంతా నీటితో నిండిపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన సత్వర చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ అందించే వర్ష సూచన వివరాల ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సీఎం సూచించారు. నగరంలో సాధారణంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడ ముందస్తుగానే అత్యవసర బృందాలను మోహరించాలని ఆదేశించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్ శాఖ, వాటర్ బోర్డ్ సహా ఇతర అన్ని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. ఈ క్రమంలోనే చీఫ్ సెక్రటరీ, డీజీపీ, స్పెషల్ సీఎస్‌లతో పాటు నగరానికి చెందిన సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షలు నిర్వహించి, తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.



## నల్లటి పాలు ఇచ్చే జంతువు

### ఇందులో కొవ్వు శాతం జీరో..!

మనందరి ఇళ్లల్లో పాల వినియోగం తప్పనిసరిగా ఉంటుంది. ఆవుపాలు, గేదె పాలను ప్రత్యేకంగా ఇంటి అవసరాలు కాఫీ,టీ, పెరుగు కోసం పాలను వాడుతుంటారు. పిల్లలు, పెద్దలు రోజూ పాలుతాగుతుంటారు. కొందరు మేక పాలను కూడా వాడుతారు. అయితే, ఈ పాలన్నీ తెల్లగా స్వచ్ఛగా ఉంటాయని మనందరికీ తెలిసిందే. కానీ, ఒక జంతువు పాలు నల్లగా ఉంటాయని మీకు తెలుసా..? అవును, చాలా జంతువుల పాలు తెల్లగా ఉంటాయి, కానీ, పాలు నల్లగా ఉండే జంతువు ఇప్పుడు తెలుసుకుందాం..

ఆరోగ్యకరమైన జీవితానికి మంచి ఆహారపు అలవాట్లు ఎంత ముఖ్యమో. అదే విధంగా పిల్లల పోషణకు పాలు అత్యంత ముఖ్యమైనవి. దాదాపు పిల్లలందరికీ ఎక్కువగా తల్లిపాలనే పడుతుంటారు. కానీ, కొందరు పిల్లలకు ఆవుపాలు, గేదె పాలు తాగిస్తుంటారు. పిల్లలతో పాటు పెద్దలు, మహిళలు కూడా పాలు తాగాలని వైద్యులు సిఫార్సు చేస్తారు. కానీ, పాల రంగు విషయానికి వస్తే చాలా మంది పాల రంగు తెలుపు అని చెబుతారు. ఇది కాకుండా మీరు లేత పసుపు రంగు పాలను కూడా చూసి ఉంటారు. అయితే మీరు ఎప్పుడైనా నలుపు రంగు పాలను చూశారా..? బహుశ మీరు ఇలాంటివి చూసి ఉండకపోవచ్చు. చాలా తక్కువ మంది మాత్రమే నల్ల పాలను చూసి ఉంటారు. అయితే, ఇలాంటి నలుపు రంగు పాలు ఆడ నల్ల ఖడ్గమృగం నుండి వస్తాయి. వాటిని ఆఫ్రికన్ బ్లాక్ ఖడ్గమృగం అని కూడా అంటారు. ఖడ్గమృగం ఇచ్చే పాలు పూర్తిగా నల్లనిరంగులో ఉంటాయి. వీటిలో కొవ్వు అస్సలు ఉండదని చెబుతుంటారు. ఇవి ఆర్యోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అంటున్నారు. శరీరానికి కావాల్సిన పోషకాలు, వీటి వల్ల పుష్కలంగా అందుతాయని చెబుతారు. ఖడ్గమృగం తల్లి పాలలో నీరు ఉంటుంది. 0.2 శాతం కొవ్వు మాత్రమే ఉంటుంది. ఈ నల్లని పాలు జంతువుల్లో పునరుత్పత్తి ప్రక్రియను నెమ్మదిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. అందుకే నల్ల ఖడ్గమృగాలు నాలుగు నుండి ఐదు సంవత్సరాల వయస్సు వచ్చిన తర్వాత మాత్రమే పునరుత్పత్తి చేయగలవు. ఇది కాకుండా, వాటి గర్భం సాధారణం కంటే ఎక్కువ. ఇవి ఒక సంవత్సరం కంటే ఎక్కువ పాటు గర్భాన్ని మోస్తాయని పరిశోధకులు చెబుతున్నారు.

# ఉసిరి.. ఆరోగ్యాల సిరి

## అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు మీ సొంతం




**ఉసిరి కాయలు సీజన్ వచ్చేస్తుంది. ఉసిరి చెట్టు లో ప్రతిదీ ఔషధ గుణాలను కలిగి ఉంది. ఉసిరి కాయలు, గింజలు, ఆకులు, చెట్టు బెరడు, వెళ్ళు, పువ్వులు ఇలా అన్నిటిని ఆయుర్వేద ఔషధాల తయారీలో ఉపయోగిస్తారు. ఉసిరి ఆరోగ్యాన్ని మాత్రమే కాదు అందాన్ని కూడా ఇస్తుంది. విటమిన్ సి అధికంగా ఉండే ఉసిరి కాయ మలబద్ధకానికి దివ్యౌషధం. అయితే అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే వృద్ధులకు ఉసిరి తినడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.**

ముఖ్యంగా పార్కిన్ సన్స్, అల్జీమర్స్, డిమెన్ షియా అనే ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడే వృద్ధులకు పెద్ద ఉసిరి లేదా రాతి ఉసిరి దివ్య ఔషదం అని శాస్త్రీయంగా నిరూపించబడిందని నిపుణులు చెబుతున్నారు. అందుకనే ఏమో మన ఋషులు ఏడాది పొడవునా ఉసిరి తినే ఆహారంలో ఒక భాగంగా చేసుకోమని మన ఆచారాల్లో భాగం చేశారు. ఉసిరి పచ్చడి, ఉసిరి తొక్కు ఇలా వివిధ రూపాల్లో ఉసిరిని ఏడాది మొత్తం తినేవారు. అయితే ఇప్పుడు ఉసిరి పచ్చడిని తింటున్నారు.. కానీ ఇతర రూపాల్లో తీసుకోవడం పై పెద్దగా శ్రద్ధ పెట్టడం లేదు. అయితే ఉసిరి కాయలు దొరికే సమయంలో వాటిని ఎండ బెట్టి నిల్వ చేసుకుని తినడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. అవి ఏమిటో తెలుసుకుందాం.. ఉసిరికాయల సీజన్ మొదలైన తర్వాత ఎక్కువగా దొరికే సమయంలో ఉసిరిని ముక్కలుగా కోసి ఎండలో పెట్టి వాటిని ఎండబెట్టుకోవాలి. తర్వాత ఆ ఎండిన ఉసిరి ముక్కలను తడి తగలకుండా గాజు సీసాలో నిల్వ చేసుకోవాలి. ఇలా ఎండ బెట్టిన ఉసిరి ముక్కలను రోజూ ఉదయం, సాయంత్రం భోజనం చేసిన అనంతరం తినాలి. ఇలా చేయడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. అయితే ఈ ఎండ బెట్టిన ఉసిరి ముక్కలను నీటిలో నానా బెట్టుకుని కూడా తినవచ్చు. వీటిని తినడం వలన నోట్లో ఉండే చెడు బ్యాక్టీరియా నశిస్తుంది. అంతేకాదు ఉసిరికాయల్లో ఉండే క్లోరోజెనిక్ యాసిడ్, కెఫిక్ యాసిడ్, ఎలాజిక్ యాసిడ్ లు మెదడుకు హానిని కలిగించే ప్రోటీన్ల ఉత్పత్తిని తగ్గిస్తాయి.

అంతేకాదు వృద్ధులకు వచ్చే పార్కిన్ సన్స్, అల్జీమర్స్, డిమెన్ షియా అనే మెదడుకి సంబంధించిన సమస్యలను తగ్గించడంలో మంచి సహాయకారిగా పనిచేస్తుంది. ఈ ఉసిరి ముక్కలను నోట్లో వేసుకుని చప్పరించడం వలన చక్కటి ఆరోగ్యం సొంతం అవుతుంది. కనుక ఉసిరికాయలు బాగా దొరికే సమయంలో వీటిని ముక్కలుగా చేసి ఎండబెట్టుకుని ఏడాది పొడవునా తీసుకోమని నిపుణులు చెబుతున్నారు.

## మానసిక, శారీరక ప్రశాంతత కోసం

# స్నానం చేసే నీటిలో వీటిని కలపండి



స్నానం ఒక విధమైన విశ్రాంతిని మానసిక శారీరక ప్రశాంతతను ఇస్తుంది. అందుకనే పొద్దున్న నిద్ర లేచిన వెంటనే స్నానం చేయడం లేదా బయట నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత స్నానం చేస్తారు. ఇలా చేయడం వలన భిన్నమైన ప్రశాంతి పొందిన అనుభూతి లభిస్తుంది. రోజంతా అలసట పోయి మనసు కూడా పూర్తిగా రిలాక్స్ అయినట్లు అనిపిస్తుంది. చాలా సార్లు రోజంతా బయట ఉండటం వల్ల, తలనొప్పి , శరీర నొప్పి వంటి సమస్యలతో ఇబ్బంది పడుతూ ఉంటారు. అటువంటి పరిస్థితిలో స్నానం చసె ముందు ఆ నీటిలో కొన్ని పదార్థాలను కలుపుకొని స్నానం చేయడం ద్వారా ఈ సమస్య నుండి బయటపడవచ్చు. స్నానం చేసే నీటిలో వీటిని కలపడం ద్వారా పూర్తిగా తాజాగా అనుభూతి చెందుతారు. అంతేకాదు అలసట అంతా ఒక్కసారిగా పోతుంది. ఈ నీటితో స్నానం చేయడం వల్ల అలసట తగ్గడమే కాకుండా ఆరోగ్యంగా కూడా ఉంటారు. స్నానం చేసే నీళ్లలో కొన్ని రకాల వస్తువులను కలపడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. చాలా మంది ప్రజలు స్నానం చేసే నీటిలో ఏమీ కలపాల్సిన అవసరం లేదని భావించి సాధారణ నీటితో స్నానం చేస్తారు. స్నానం చేసే నీటిలో కొన్ని పదార్థాలను కలపడం ద్వారా అనేక భౌతిక ప్రయోజనాలను పొందవచ్చు. స్నానపు నీళ్లలో వేటిని కలుపుకోవడం వలన ఏయే ప్రయోజనాలు పొందవచ్చునో తెలుసుకుందాం..

**పిప్పర్‌మెంట్ ఆయిల్**

స్నానం చేసే నీటిలో కొన్ని చుక్కల పిప్పర్‌మెంట్ ఆయిల్‌ను జోడించడం ద్వారా అలసట వెంటనే పోతుంది. అంతేకాదు స్నానం చేసిన వెంటనే పూర్తిగా రిఫ్రెష్ అయిన ఫీలింగ్ కలుగుతుంది. ఈ నూనె శరీరాన్ని చల్లబరుస్తుంది. మనస్సును రిలాక్స్ అయ్యేలా చేస్తుంది. అయితే ఈ నూనెను నీటిలో రెండు చుక్కల కంటే ఎక్కువ వేయకూడదు అని గుర్తుంచుకోండి. పిప్పరమింట్ ఆయిల్ అనాల్జేసిక్ లక్షణాలను కలిగి ఉంది. కనుక ఇది తలనొప్పి, మైగ్రేన్ నుంచి ఉపశమనం ఇవ్వడంలో కూడా సహాయపడుతుంది.

**పసుపు**

పసుపు దీని శోథ నిరోధక, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలతో ప్రసిద్ధి చెందింది. పసుపుని నీటిలో వేసి స్నానం చేయడం వల్ల ఎక్కడైనా గాయాలు ఉంటే త్వరగా మానిపోతాయి. అయితే పసుపు కలిపినా నీటితో స్నానం చేయడం వలన కలిగే ప్రయోజనాలను పొందడానికి.. స్నానం చేసే నీటిలో పసుపు వేసి సుమారు 15 నిమిషాలు వదిలివేయండి. దీని తర్వాత నీరు రంగు లేత పసుపు రంగులోకి మారుతుంది. అప్పుడు సాధారణ నీటిని కలపండి . స్నానం చేయండి. దీని వల్ల శరీరం పసుపు రంగులోకి మారదు. పసుపు వల్ల కలిగే ప్రయోజనాలను కూడా పొందుతారు.

**గంధం**

మానసిక శాంతి కోసం స్నానం చేసే నీటిలో చందనం ఉపయోగించవచ్చు. దీని సువాసన మనసుకు విశ్రాంతినిస్తుంది. దీనితో పాటు శరీరం నుండి అలసట మరియు ఒత్తిడిని కూడా తొలగిస్తుంది. ఈ ప్రయోజనాలను పొందడానికి, గోరువెచ్చని నీటిలో కొన్ని చుక్కల గంధపు నూనెను కలపండి. ప్రతిరోజూ స్నానం చేయండి.

**వేప నూనె**

గోరువెచ్చని నీటిలో వేపనూనె కలిపి తలస్నానం చేయడం వల్ల దురదలు, దద్దుర్లు వంటి సమస్యల నుంచి బయటపడవచ్చు. స్కిన్ ఇన్ఫెక్షన్ వంటి సమస్యలు వేసవిలో లేదా వర్షాకాలంలో తరచుగా సంభవిస్తాయి, అటువంటి పరిస్థితిలో వేప నూనె ప్రయోజనకరంగా ఉంటుంది.

**రోజ్ వాటర్**

చెమట వాసనతో బాధపడేవారు రోజూ రోజ్ వాటర్‌ను నీటిలో కలుపుకుని స్నానం చేయాలి. ఇందుకోసం మార్కెట్‌లో లభించే రోజ్ వాటర్‌ను ఉపయోగించవచ్చు లేదా 5-6 గులాబీ రేకులను నీటిలో వేసి మరిగించి రోజ్ వాటర్‌ను సిద్ధం చేసుకోవచ్చు. లేదా స్నానం చేసే నీటిలో గులాబీ రేకులను కలపవచ్చు. ఈ నీటితో స్నానం చేయడం వల్ల కూడా బాగా నిద్ర పడుతుంది.

# అత్యాశే మనిషికి శత్రువు!

### త్వరగా ధనవంతులు కావాలి , తక్కువ సమయంలోనే ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశే మోసగాళ్లకు బ్రహ్మాస్త్రం

### ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న ఆర్థిక మోసాలు

### వివేకం కోల్పోతే జీవితాంతం కష్టపడి కూడబెట్టిన సంపద క్షణాల్లో మాయమవుతుంది



ఒకప్పుడు దొంగలు అర్ధరాత్రి ఇళ్లలోకి చొరబడి సంపదను దోచుకెళ్లేవారు. నేడు మోసగాళ్లకు ఆ అవసరం లేదు. ఒక మొబైల్ ఫోన్, ఒక ఆకర్షణీయమైన ప్రకటన, కొన్ని మాయమాటలు చాలు. మనమే వారి వలలో పడుతూ, మన కష్టార్జిత సంపదను వారి చేతుల్లో పెడుతున్నాం. ఇదే నేటి ఆర్థిక మోసాల చేదు వాస్తవం.

తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పెట్టుబడి మోసాలు, మైక్రో ఫైనాన్స్ కుంభకోణాలు, ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాలు, క్రిప్టో ఉచ్చులు, గోల్డ్ స్కీములు, మల్టీ లెవెల్ మార్కెటింగ్ పేరుతో జరుగుతున్న ఆర్థిక నేరాలు వేలాది కుటుంబాల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి.

ఇటీవల వెలుగుచూసిన అనేక పెట్టుబడి స్కాంలు, మైక్రో ఫైనాన్స్ మోసాలు, నకిలీ పెట్టుబడి పథకాలు ప్రజల జీవితకాల పొదుపులను కబళించాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఈ మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

డబ్బు పోవడం మాత్రమే కాదు... దానితో పాటు మానసిక ప్రశాంతత, కుటుంబ ఆనందం, భవిష్యత్తుపై నమ్మకం కూడా కోల్పోతున్నారు. జీవితాంతం శ్రమించి కూడబెట్టిన సంపద కొన్ని రోజుల్లోనే ఆవిరైపోతోంది.

ఈ పరిస్థితుల్లో ఒక ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. సమాజంలో మోసగాళ్లు పెరుగుతున్నారా? లేక మోసపోయే వారి సంఖ్య పెరుగుతోందా? నిజానికి మోసగాళ్లు కొత్తవారు కాదు. యుగాలుగా ఉన్నవారే. మారింది వారి రూపం, పద్ధతి, సాంకేతికత మాత్రమే. కానీ వారి వలలో చిక్కుకునే వారి సంఖ్య పెరగడానికి ప్రధాన కారణం ఒక్కటే: అత్యాశ.

**ఆశ అవసరం... అత్యాశ ప్రమాదం**

ఆశ మనిషిని ముందుకు నడిపిస్తుంది. ఆశయం జీవితానికి దారి చూపుతుంది. కానీ శ్రమ లేకుండా, సమయం పట్టకుండా, తక్కువ కాలంలో అధిక లాభాలు పొందాలని కోరుకోవడం అత్యాశ. అదే మోసాలకు మొదటి మెట్టు.

"అధిక వడ్డీ", "రెట్టింపు లాభాలు గ్యారెంటీ", "రిస్క్ లేని పెట్టుబడి", "ఇతరులు లక్షలు సంపాదిస్తున్నారు", "మీ బంధువులు కూడా పెట్టారు" వంటి మాటలు వినగానే చాలా మంది ఆలోచనను పక్కనపెట్టి భావోద్వేగాలతో నిర్ణయాలు తీసుకుంటారు.

నిజానికి మోసగాళ్లు ముందుగా మన డబ్బును కాదు... మన ఆలోచనా విధానాన్ని దోచుకుంటారు.

వివేకం కంటే అత్యాశ బలంగా మారిన క్షణమే మోసం విజయవంతమవుతుంది.

**చదువుకున్నవారూ ఎందుకు మోసపోతున్నారు?**

ఈ మోసాలకు బలవుతున్నవారిలో కేవలం అమాయకులు మాత్రమే లేరు. ఉన్నత విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, పదవీ విరమణ చేసినవారు, సాఫ్ట్‌వేర్ నిపుణులు కూడా ఉన్నారు.

ఎందుకంటే మోసగాళ్లు మన తెలివితేటలను కాదు, మన బలహీనతలను లక్ష్యంగా చేసుకుంటారు. ఎక్కువ సంపాదించాలని కోరుకోని వ్యక్తి ఉండడు. ఆ కోరికనే వారు ఆయుధంగా మార్చుకుంటారు.

**సోషల్ మీడియా - మోసాలకు కొత్త వేదిక**

ఒకప్పుడు మోసగాళ్లు ఇంటింటికీ తిరిగి నమ్మకం సంపాదించాల్సి వచ్చేది. ఇప్పుడు సోషల్ మీడియా ఆ పనిని సులభతరం చేసింది.

నకిలీ వెబ్‌సైట్లు, కృత్రిమ విజయగాథలు, ప్రముఖుల ఫోటోలు, ఫేక్ రివ్యూలు, వాట్సాప్ గ్రూపులు, టెలిగ్రామ్ ఛానెల్లు, యూట్యూబ్ ప్రకటనలు... ఇవన్నీ నమ్మకాన్ని అమ్మే సాధనాలుగా మారిపోయాయి. మొబైల్ స్క్రీన్‌పై కనిపించే ప్రతి అవకాశం నిజం కాదు. చాలా సందర్భాల్లో అది మోసానికి వేసిన అందమైన ముసుగు మాత్రమే.



**ఆర్థిక అక్షరాస్యత అవసరం**

నేటి ప్రపంచంలో చదవడం, ఉద్యోగం చేయడం మాత్రమే సరిపోదు. డబ్బును ఎలా సంపాదించాలో తెలిసినంతగా, దాన్ని ఎలా కాపాడుకోవాలో కూడా తెలుసుకోవాలి.

పెట్టుబడి పెట్టే ముందు ప్రతి ఒక్కరూ ఒక సూత్రాన్ని గుర్తుంచుకోవాలి: అధిక లాభం అంటే అధిక ప్రమాదం. ప్రమాదం లేకుండా భారీ లాభాలు వస్తాయని చెప్పేవాడు వ్యాపారి కాదు, మోసగాడే అయ్యే అవకాశాలు ఎక్కువ.

ఏ పథకంలోనైనా పెట్టుబడి పెట్టే ముందు దాని చట్టబద్ధత, వ్యాపార నమూనా, లాభాల మూలం, నియంత్రణ సంస్థల అనుమతులు ఉన్నాయా లేదా అన్న విషయాలను పరిశీలించాలి. అర్థం కాని చోట డబ్బు పెట్టడం అంటే కళ్లుమూసుకుని అగాధంలో అడుగు వేయడమే.

**గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయాలు**

శ్రమ లేకుండా వచ్చిన సంపద ఎక్కువకాలం నిలవదు.

అసాధారణ లాభాలు వస్తాయని చెప్పే ప్రతి అవకాశానికి వెనుక అసాధారణ ప్రమాదాలు కూడా దాగి ఉంటాయి.

లికేవలం "అందరూ పెట్టుబడి పెడుతున్నారు" కాబట్టి మనం కూడా పెట్టడం సరైన నిర్ణయం కాదు.

"నాకు తెలిసిన వ్యక్తి చెప్పాడు" అనే కారణం ఏ పెట్టుబడికైనా భద్రతకు హామీ ఇవ్వదు.

పెట్టుబడులు పెట్టే ముందు పూర్తిస్థాయిలో సమాచారం సేకరించడం, ప్రమాదాలను అంచనా వేయడం, వివేకంతో నిర్ణయం తీసుకోవడం అత్యంత అవసరం.

**మన డబ్బుకు మనమే కాపలాదారు**

ప్రభుత్వాలు చట్టాలు చేయగలవు. పోలీసులు నేరస్తులను పట్టుకోగలరు. కోర్టులు శిక్షలు విధించగలవు. కానీ మోసపోయిన తర్వాత కోల్పోయిన డబ్బు, నమ్మకం, ప్రశాంతతను పూర్తిగా తిరిగి తీసుకురావడం చాలా కష్టం.

అందుకే ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి, ప్రతి పెట్టుబడిదారు గుర్తుంచుకోవాల్సిన సత్యం ఒక్కటే:

"అత్యాశ మొదలైన చోట వివేకం ఉండదు... వివేకం లేని చోటే మోసం ప్రారంభమవుతుంది."

త్వరగా ధనవంతులు కావాలనే ఆరాటం కంటే, కష్టపడి ఎదగాలనే సహనం గొప్పది. ఎందుకంటే డబ్బు కోల్పోతే తిరిగి సంపాదించవచ్చు. కానీ జీవితకాల శ్రమతో కూడిన పొదుపులు కోల్పోతే ఆ గాయం చాలా కాలం మానదు.

అందుకే... అత్యాశను అదుపులో ఉంచండి. అవగాహనను పెంచుకోండి. వివేకంతో నిర్ణయాలు తీసుకోండి. మీ కష్టార్జిత సంపదను కాపాడుకోండి.

అత్యాశ మనిషిని ధనవంతుడిని చేయడం ఏమో కానీ క్షణాల్లో నిరుపేదను మాత్రం చేయగలదు.



**జి. అజయ్ కుమార్**

# గడువుకు ముందే పంజాబ్ ఎన్నికలు

### పార్టీ కార్యాకర్తలు ప్రచారంలోకి దిగండి

### నవంబర్‌లోనే ఎన్నికలు జరిగే ఛాన్స్

### ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సంకేతాలు

**జయ జయహే**



పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు గడువు కంటే ముందుగానే జరిగే అవకాశం ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంకేతాలిచ్చారు. 2027 ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉండగా, 2026 నవంబర్‌లోనే ఎన్నికలు జరగవచ్చని అన్నారు. 'ఆప్' ముఖ్యమంత్రి అభ్యర్థిగా భగవంత్ మాన్ కొనసాగుతారని ప్రకటించారు. బటిండాలో శనివారంనాడు జరిగిన రోడ్‌షోలో కేజ్రీవాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు తక్షణం ఎన్నికల ప్రచారానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ముందస్తు ఎన్నికలకు కారణాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి మద్దతుగా నిలిచిన ఓటర్లకు కేజ్రీవాల్ కృతజ్ఞతలు తెలిపారు. బర్నాలా, మోగా, బటాలా, బటిండా మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్లుగా ఆప్ కౌన్సిలర్లు ఎన్నికయ్యారని, పార్టీ పాలనపై ప్రజలకున్న నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా భగవంత్ మాన్ కొనసాగుతారని, మరోసారి మాన్ సీఎం అయ్యేందుకు పార్టీ కార్యకర్తలందరూ కృషి చేయాలని కేజ్రీవాల్ కోరారు. గత నాలుగేళ్లుగా పంజాబ్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని, మద్దతును సాధించిందని అన్నారు. పార్టీల పేరు చెప్పకుండా విపక్షాలపై కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. ఒకటి 'చిట్టా పార్టీ', మరొకటి 'ఫైటింగ్ పార్టీ', మూడో పార్టీ 'ఈడీ పార్టీ' అని అభివర్ణించారు. డ్రగ్స్ సమస్యలు, అంతర్గత పోరాటాలు, సెంట్రల్ ఏజెన్సీలతో ప్రత్యర్థులను భయపెట్టే పార్టీలుగా వారిని పోల్చారు. ప్రజాసంక్షేమ, అభివృద్ధి కోసం పని చేసే పార్టీ ఆప్ మాత్రమేనని, పంజాబ్ నేతల్లో అత్యంత నిజాయితీ కలిగిన ముఖ్యమంత్రుల్లో భగవంత్ మాన్ ఒకరని ప్రశంసించారు. గత ప్రభుత్వాలు అవినీతి, కుంభకోణాల ఆరోపణలు ఎదుర్కొన్నాయని, మాన్ హయాంలో అలాంటి ఆరోపణలు ఒక్కటి కూడా లేవని అన్నారు. ఏవైనా తప్పులు చేసి ఉంటే ఈడీ, సీబీఐ చర్య తీసుకుని ఉండేవని అన్నారు. పంజాబ్‌లో పలు సంక్షేమ పథకాలను ఆప్ అమలు చేస్తోందని, ఉచిత విద్యుత్, రూ.10 లక్షల వరకూ ఆరోగ్య బీమా ప్రజలకు అందిస్తోందని కేజ్రీవాల్ గుర్తుచేశారు. జూలై నుంచి అర్హత కలిగిన మహిళలకు ప్రతినెలా రూ.1,000 ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. షెడ్యూల్డ్ కులాల మహిళలకు రూ.1,500 చొప్పున ఇస్తామని తెలిపారు. కేజ్రీవాల్ రోడ్‌షోలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆప్ సీనియర్ నేత మనీష్ సిసోడియా, పంజాబ్ ఆప్ అధ్యక్షుడు అమన్ అరోరా పాల్గొన్నారు.




# ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

### గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణం

### మంత్రులతో కలసి శంకుస్థాపన చేసిన భట్టి

**జయ జయహే**

కేవలం దైవభక్తి కోసమే కాకుండా, సమాజంలో మార్పు కోసం విద్యకు , రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లాలోని ప్రసిద్ధ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కలిసి ఘనంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారంతా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విద్య ద్వారా మాత్రమే సమాజంలో ఉన్నతమైన మార్పులు తీసుకురావచ్చని తాము గట్టిగా నమ్ముతున్నట్లు చెప్పారు. గతంలో రేవంత్ రెడ్డి చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన పిప్పిరి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ మాట ఇచ్చిన కేవలం 37 రోజుల్లోనే నిధులు మంజూరు చేసి, ఈ రోజు భూమి పూజ చేసుకోవడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గూడెం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని రూ. 70 కోట్లతో అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 2,216 కోట్లతో వివిధ దేవాలయాలను అభివృద్ధి చేసిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇందులో భాగంగానే ఇటీవల సరస్వతీ పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించామని, అలాగే రాబోయే గోదావరి పుష్కరాల కోసం కూడా రూ. 802 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒకవైపు దైవభక్తి కోసం నిధులు ఇస్తూనే, మరోవైపు అన్నదాతలను ఆదుకునేందుకు రూ. 74 కోట్ల వ్యయంతో 'గూడెం లిఫ్ట్ ఇరిగేషన్' పనులను కూడా చేపడుతున్నామని, దీనివల్ల స్థానిక రైతులకు సాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరుతాయని డిప్యూటీ సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.



# సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ

### 335 మంది డిపెండెంట్ కార్మికులకు నియామక పత్రాలు

### కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి

**జయ జయహే**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన 335 మంది డిపెండెంట్ కార్మికులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసి, బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువత క్రమశిక్షణతో పనిచేసి సింగరేణి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణిని మరింత లాభాల బాటలో నడిపించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూనే, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మిక కుటుంబాల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు విఠల్), స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్యేలు మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణతో పాటు సింగరేణి ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పాస్ పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీస్ భేష్

### 19న ఢిల్లీలో జైశంకర్ చేతుల మీదుగా అవార్డు

**జయ జయహే**

పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. దేశంలోనే ఉత్తమ పోలీసు ధ్రువీకరణ సేవలకు గాను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు' వరించింది. 2025-26 సంవత్సరంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరుకు గాను తెలంగాణ పోలీస్ శాఖకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు తెలంగాణ పోలీస్ శాఖను కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఈ అవార్డును అందుకోవాల్సిందిగా డీజీపీ సీవీ ఆనంద్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ఆహ్వానం పంపింది. జూన్ 19న న్యూఢిల్లీలో డీజీపీ ఈ అవార్డును అందుకోనున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరుగనుంది. వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు ధ్రువీకరణ సేవలకే ఈ గుర్తింపు లభించింది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com